సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్
శనివారం 28.02.2026
@mudranews mudratv
సంపుటి: 13 సంచిక: 127
పేజీలు: 12 వెల: రూ. 5

# కేజ్రీవాల్, కవితలకు కోర్టు క్లీన్ చిట్

## లిక్కర్ స్కాంలో పెను సంచలనం

మూడేళ్ల కేసుకు కోర్టు ముగింపు.. ఆధారాలేమీ లేవని స్పష్టం
23 మంది నిందితులపై ఆరోపణలు కొట్టివేసిన ప్రత్యేక కోర్టు
సీబీఐ దర్యాప్తుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన న్యాయస్థానం
ఊహాగానాలపై కేసులు పెట్టడం సరైంది కాదన్న జడ్జి వ్యాఖ్యలు
'న్యాయం గెలిచింది' అంటూ ఆప్, బీఆర్ఎస్ శ్రేణుల్లో సంబరాలు
దర్యాప్తు సంస్థల విశ్వసనీయతపై మళ్లీ ప్రశ్నలు
హైకోర్టుకు వెళ్తామన్న సీబీఐ.. కేసు ఇంకా ముగియలేదు
ఎన్నికల రాజకీయాల్లో కీలక మలుపు తీసుకున్న లిక్కర్ స్కాం
రాజకీయ వేధింపుల ఆరోపణలకు బలం చేకూరిందా?
కొత్త చర్చలు

9



## లిక్కర్ కేసులో వాళ్లు నిర్దోషులు కారు

3

సాంకేతిక కారణాలతోనే రౌస్ అవెన్యూ కోర్టు తీర్పిచ్చింది
సిబిఐ పై కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంది
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

# తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు పొందాలి

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాంస్కృతిక అవగాహన లేనిదే సమాజం అభివృద్ధి సాధ్యం కాదు
సంప్రదాయ కళలపై ఆసక్తి, కళాకారులకు గౌరవం భేష్
ఘనంగా 'జీవి ఆన్ వీల్స్' కార్యక్రమం ప్రారంభోత్సవం

10



# ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు మోక్షం..

రూ.745 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు..
ఉద్యోగులకు భారీ నిధుల విడుదల

భట్టి ఆదేశాలతో ఫిబ్రవరి బిల్లుల క్లియర్.. రూ.745 కోట్లు రిలీజ్
ప్రతి నెల రూ.700 కోట్లు చెల్లింపు హామీ అమలు.. మరో విడత నిధులు విడుదల
గ్రాట్యుటీ, జీపీఎఫ్, లీవ్ సరెండర్ బిల్లులకు క్లియర్ సిగ్నల్
ఉద్యోగుల బకాయిలపై దృష్టి.. వరుసగా నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం
జూన్ నుంచి కొనసాగుతున్న చెల్లింపులు.. మరోసారి భారీ విడుదల
పంచాయతీలకు శుభవార్త.. రూ.389 కోట్లు రిలీజ్
గ్రామాభివృద్ధికి ఊతం.. పంచాయతీలకు భారీ నిధుల మంజూరు
ఉద్యోగులు, గ్రామపంచాయతీలకు డబుల్ బూస్ట్..
మొత్తంగా రూ.1134 కోట్లు విడుదల

10





## మోడీ తో విజయ్,రష్మిక భేటీ..

మోడీకి ఆహ్వానం...
హైదరాబాద్ రిసెప్షన్‌పై సస్పెన్స్
విజయ్–రష్మిక వెడ్డింగ్ వైరల్...
మిలియన్ల లైక్స్‌తో రికార్డు
ఉదయపూర్ పెళ్లి ఘనంగా...
బంజారా హిల్స్‌లో
గ్రాండ్ రిసెప్షన్ రెడీ
సెలబ్రిటీలతో పాటు రాజకీయ
నేతలకు ఆహ్వానం...
వేడుకపై భారీ అంచనాలు
మోడీ వస్తారా?... టాలీవుడ్
హైప్రొఫైల్ రిసెప్షన్‌పై ఉత్కంఠ

12



## మోదీ ఇండ్లు కడుతుంటే.. రేవంత్ కూల్చుతున్నారు

3

పేదల ఇండ్లు కూల్చడం తప్ప కాంగ్రెస్ సాధించినదేమిటి?
అని ప్రశ్నించిన బండి సంజయ్
రైతు భరోసా పేరుతో రైతులకు రూ.27 వేల కోట్లు బాకీ ఉన్నాయంటూ ఆరోపణలు
ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు మోసపోయారన్న కేంద్ర మంత్రి
కాంగ్రెస్, మజ్లిస్ ఒకటేనని... పైకి డ్రామాలు మాత్రమేనని ఘాటు వ్యాఖ్యలు
కాళేశ్వరం అవినీతి పై విచారణకు ధైర్యం లేదని... కేంద్రానికి లేఖ రాయాలని సవాల్

## బొత్స సత్యనారాయణకు బ్రెయిన్ స్ట్రోక్

10

సీరియస్ కావడంతో హుటాహుటిన హైదరాబాద్ కు!



# బడ్జెట్ సవాల్

బడ్జెట్‌కు ముందే భారీ సవాల్‌లో రేవంత్ సర్కార్
పెన్షన్ల పెంపు, మహాలక్ష్మి పథకం పై కీలక నిర్ణయాలు
రూ.3.25 లక్షల కోట్ల బడ్జెట్‌కు కసరత్తు వేగం
హామీల అమలే లక్ష్యం...ఖజానాపై భారీ భారం
పెన్షన్ల పెంపుకు కొత్త ఫార్ములా సిద్ధం
విడతల వారీగా పెంపు...తొలి దశలో రూ.500 పెంపు?
అప్పులపై ఆధారపడే బడ్జెట్‌పై విమర్శలు
బీఆర్ఎస్ ఒత్తిడి...హామీలపై రాజకీయ వేడి
పన్నులు పెంచకుండా సంక్షేమం ఎలా? సర్కార్‌కు పరీక్ష
బడ్జెట్‌లో స్పష్టతకు ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ కసరత్తు చేస్తోంది. ఈ సారి రెండు కీలక పథకాలకు భారీగా నిధులు కేటాయించిన అవసరం కనిపిస్తోంది. తెలంగాణలో బడ్జెట్ నగారా మోగనుంది. మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ సర్కార్ దాదాపు రూ. 3.25 లక్షల కోట్లతో భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు

..మిగతా 2లో



# పెద్దల సభా "రాజకీయం"

రెండు సీట్ల కోసం కాంగ్రెస్ క్లీన్ స్వీప్ లక్ష్యం



రెండు సీట్ల కోసం కాంగ్రెస్ క్లీన్ స్వీప్ లక్ష్యం
గెలుపు కష్టమేనైనా బీఆర్ఎస్ బలపరీక్షకు సిద్ధం
మైనారిటీ కార్డుతో కాంగ్రెస్‌పై ఒత్తిడి పెంచే గులాబీ దళం
ఫిరాయింపు ఎమ్మెల్యేలకు రాజ్యసభ ఎన్నికల అగ్నిపరీక్ష
సంఖ్యాబలం కాంగ్రెస్‌కు అనుకూలం..
కానీ టెన్షన్ మాత్రం మిగిలిందే
ఓటింగ్ గుట్టుచప్పుడు కాకపోయినా రాజకీయ ప్రభావం భారీగా
రెండో అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్‌లో పెరుగుతున్న పోటీ
సీనియర్లు, సామాజిక సమీకరణాల మధ్య హైకమాండ్ చిక్కులు
ఫలితం కంటే రాజకీయ ప్రభావమే ఎక్కువగా మారే పోరు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ ప్లాన్ చేసుకుంటోంది. గెలవకపోయినా కాంగ్రెస్ పార్టీని కొన్ని విషయాల్లో ఇబ్బంది పెట్టాలని అనుకుంటున్నారు. రాజ్యసభ ఎన్నికల చదరంగంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ ఎత్తుగడలకు పదును పెడుతున్నాయి. సంఖ్యాబలం తక్కువగా ఉన్నా సరే పోటీకి దిగడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని బీఆర్ఎస్ భావిస్తుండగా, క్లీన్ స్వీప్ చేయాలని కాంగ్రెస్

..మిగతా 2లో

## హోటళ్లకు రేటింగ్స్.. సర్టిఫికేషన్

మున్సిపల్ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశం
హోటళ్లలోని వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు
వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలి
తనిఖీల కోసం ప్రత్యేక మానిటరింగ్ వింగ్


3



# అనుకోని బహుమతి

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో క్లీన్ చిట్
23 మంది ప్రమేయంపై ఆధారాలు లేవు

కవిత సహా జైలు శిక్ష అనుభవించిన పలువురు
రాష్ట్రంలో ఎన్నికల్లో ప్రభావం చూపిన లిక్కర్ స్కాం
తీర్పు తర్వాత అన్నాచెల్లి లొల్లి




ముద్ర, తెలంగాణ బ్యూరో:

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆప్ చీఫ్ కేజ్రీవాల్ సహా కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. లిక్కర్ కేసులో క్లీన్ చిట్ ఇస్తూ రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును వెలువరించింది. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. అంతేకాదు.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి ఈ కేసు కారణమనే ఆరోపణలు ఉన్నాయి. అయితే అభియోగాలపై తగిన ఆధారాలు లేవని రౌస్ అవెన్యూ కోర్టు పేర్కొంది. ఆధారాలు లేకుండా ఇరికించారని సీబీఐపై కోర్టు ఆగ్రహం ఆగ్రహం వ్యక్తంచేసింది. 23 మంది తప్పు చేశారని సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది.

..మిగతా 2లో

## ఆకాశంలో అద్భుతం.. ఒకే వరుసలో ఆరు గ్రహాలు!

9

గ్రహాల పరేడ్ రేపే..
అరుదైన ఖగోళ దృశ్యం మిస్ కావొద్దు
సూర్యాస్తమయం తర్వాత విశేషం..



ఇదీ ఏఐ ముద్ర
మాజీ సీఎం కేజ్రీవాల్, జాగృతి అధ్యక్షురాలు కవితకు లిక్కర్ స్కాం నుంచి ఊరట.. ఊపిరి పీల్చుకున్నారు.






## తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి నడుద్దాం

### ఉత్తమ్ కుమార్ రెడ్డి

మీ సమస్యలు తెలుసు.. తప్పక పరిష్కరిస్తాం...
నిర్మాణ సంస్థలు, కాంట్రాక్టర్లకు మంత్రి హామీ...
ఆరంభమైన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా 4వ నేషనల్ యం.సి, జి.సి సమావేశాలు

2

# మళ్లీ పెడదోవ పట్టొద్దు

జనజీవన స్రవంతిలోకి వచ్చి ఏదైనా చేసుకోండి
ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది
శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించం
ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై ఆలోచన చేస్తాం
మీ లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తా
'మావో'అగ్రనేతలతో సీఎం రేవంత్ రెడ్డి

2




## కవితకు న్యాయం జరిగింది.. కేటీఆర్ హర్షం

మద్యం కేసులు రాజకీయ ప్రేరేపితమే..
త్వరలో నిజం బయటపడుతుంది: కేటీఆర్
మీడియా ట్రయల్స్ వల్లే నష్టం..
న్యాయ ప్రక్రియను పక్కన పెట్టారని ఆగ్రహం
కవిత విడుదలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆనందం.. కుటుంబంలో ఉత్సాహం
కేసు ముగిసిన తరువాత కవిత రాజకీయ నిర్ణయం ఏంటి?
ఉత్కంఠ పెరుగుతోంది

3





**టాప్ 10 మేధావులు**

1.ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతంతో భౌతికశాస్త్రాన్ని కొత్త దిశలో తీసుకెళ్లాడు. ప్రపంచం, కాలం, గురుత్వాకర్షణపై మన అవగాహనను పూర్తిగా మార్చేశాడు.

# బడ్జెట్ సవాల్



(మొదటి పేజీ తరువాయి)

కసరత్తు చేస్తోంది. ఎన్నికల హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వానికి, ఈ దఫా బడ్జెట్ ఒక పెద్ద అగ్నిపరీక్షగా మారనుంది. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలలో మిగిలిపోయిన కీలక హామీలకు నిధులు ఎలా సర్దుబాటు చేస్తారనేది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరంగా మారింది.

**కీలక హామీలు ఇంకా పెండింగ్‌లోనే!**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తోంది. అయితే మహిళలకు నెలకు రూ.2500 మహాలక్ష్మి నగదు బదిలీ, వృద్ధాప్య పింఛన్లు రూ.4000కి పెంపు వంటి భారీ ఖర్చుతో కూడిన హామీలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేల చెల్లింపులకు అవసరమైన నిధుల సమీకరణ కూడా ఆర్థిక శాఖకు సవాల్‌గా మారింది. ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో సంక్షేమ పథకాల భారం ఖజానాపై ఒత్తిడి పెంచుతోంది.

**అప్పులపైనే ఆధారం**

రాష్ట్ర ఆదాయం జీఎస్టీ, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చినా.. అదనపు నిధుల కోసం ప్రభుత్వం అప్పులపైనే ఆధారపడుతోంది. రోజువారీ ఖర్చులు, జీతాలు, పాత అప్పుల వడ్డీలకే భారీ మొత్తాలు వెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో రూ.60 వేల కోట్లకు పైగా కొత్త అప్పులు తీసుకునే యోచనలో ప్రభుత్వం ఉందన్న విమర్శలు వస్తున్నాయి.

**హామీలపై రాజకీయ ఒత్తిడి**

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ హామీల అమలుపై ఒత్తిడి పెంచుతోంది. రెండు బడ్జెట్లు గడిచినా 95% హామీలు అమలు కాలేదని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. పింఛన్లు, మహిళల ఆర్థిక సాయం వంటి అంశాలపై స్పష్టత లేకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**పన్నుల భారం లేకుండా అమలు సవాల్**

హామీలను అమలు చేయాలి, కానీ ప్రజలపై కొత్త పన్నులు వేయకూడదన్న ఒత్తిడి ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఆదాయం పెంచే మార్గాలపై దృష్టి పెట్టాలా లేక అప్పులపై ఆధారపడాలా అన్నది ఈ బడ్జెట్‌లో తేలనుంది.

**పింఛన్ల పెంపుపై కొత్త ఫార్ములా**

చేయూత పింఛన్‌ను రూ.4000కి, దివ్యాంగులకు రూ.6000కి పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం.. భారీ ఆర్థిక భారం దృష్ట్యా విడతల వారీగా పెంపు ఆలోచిస్తోంది. ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయి. నెలకు రూ.950 కోట్లు ఖర్చవుతుండగా, రూ.500 పెంపుతో మరో రూ.210 కోట్లు అదనంగా అవసరం. తొలి విడతలో రూ.500 పెంచి, దశలవారీగా ఎన్నికల నాటికి లక్ష్యాన్ని చేరే విధంగా ప్రణాళిక సిద్ధమవుతోంది.

**బడ్జెట్‌లో స్పష్టత**

ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు పెండింగ్ హామీలపై దృష్టి పెట్టింది. పింఛన్ల పెంపు సహా కీలక అంశాలపై ఈసారి బడ్జెట్‌లో స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# పెద్దల సభా "రాజకీయం"

(మొదటి పేజీ తరువాయి)



పట్టుదలగా ఉంది. అసెంబ్లీలో ఉన్న 119 మంది ఎమ్మెల్యేల లెక్కల ప్రకారం ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 60 ఓట్లు అవసరం. ప్రస్తుతం బీఆర్ఎస్‌కు ఉన్న బలం రీత్యా గెలుపు సాధ్యం కాకపోయినా, ఒక మైనార్టీ అభ్యర్థిని పోటీలో నిలబెట్టడం ద్వారా కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలో పడేయాలని చూస్తున్నారు. ఒకవేళ తమ అభ్యర్థికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఓటు వేస్తే, మైనార్టీల వ్యతిరేకిగా ముద్ర వేయవచ్చనేది ప్రతిపక్ష పార్టీ ఆలోచన. ఈ ఎత్తుగడ ద్వారా కాంగ్రెస్ తన అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేసుకునేలా ఒత్తిడి తేవడమే ప్రధాన లక్ష్యం.

**ఫిరాయింపు ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్ష**

తెలంగాణలో రాజ్యసభ ఎన్నికల నేపథ్యం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీలో 119 మంది ఎమ్మెల్యేల లెక్కల ప్రకారం ఒక్కో అభ్యర్థి గెలవడానికి సుమారు 60 ఓట్లు అవసరం. బలం తక్కువైనా బీఆర్ఎస్ మైనార్టీ అభ్యర్థిని బరిలోకి దింపి కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టే వ్యూహం అమలు చేయాలని చూస్తోంది. తమ అభ్యర్థికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ఓటేస్తే మైనార్టీల వ్యతిరేకిగా ముద్ర వేయవచ్చన్న ఆలోచనతో రాజకీయ ఒత్తిడి సృష్టించడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ఇక ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు పలువురిని డిశ్చార్జ్ చేయడం కూడా రాజకీయ చర్చకు దారి తీసింది.

**ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పరీక్ష**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నారు. రహస్య బ్యాలెట్ విధానం ఉన్నా పార్టీలు విప్ జారీ చేయగలవు. విప్‌కు వ్యతిరేకంగా ఓటేస్తే అనర్హత భయం, సొంత పార్టీకి వ్యతిరేకంగా వెళ్ల లేని పరిస్థితి ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఇబ్బంది పెడుతోంది. ఈ పరిస్థితిని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీఆర్ఎస్ చూస్తోంది.

కాంగ్రెస్‌కు సంఖ్యాబలం

కాంగ్రెస్‌కు ప్రస్తుతం 64 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీఆర్ఎస్ నుంచి వచ్చినవారితో కలిపి సంఖ్య 70కి పైగా ఉంది. మజ్లిస్ మద్దతుతో రెండు స్థానాలు గెలుచుకునే అవకాశాలు బలంగా ఉన్నాయి. అయితే బీఆర్ఎస్ పోటీ పెడితే ప్రతి ఓటు కీలకమవుతుంది.

బీఆర్ఎస్ లక్ష్యం - రాజకీయ ప్రభావం

గెలుపు కంటే కాంగ్రెస్‌లో చీలికలు ఉన్నాయనే సందేశం ఇవ్వడమే బీఆర్ఎస్ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. మైనార్టీ కార్డ్ ద్వారా కాంగ్రెస్‌ను రక్షణాత్మక స్థితిలోకి నెట్టాలని ప్రయత్నిస్తోంది.

**రాజకీయ ప్రభావం ముందుంది**

ఈ ఎన్నికలు కేవలం సభ్యుల ఎంపికకే పరిమితం కాకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది.

**కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠ**

రెండు స్థానాలు ఖాళీ కావడంతో కాంగ్రెస్‌లో ఆశావహుల జాబితా పెద్దది. ప్రస్తుత సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీకి మరోసారి అవకాశం దాదాపు ఖాయం. రెండో స్థానానికి మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి పేరు వినిపిస్తోంది.అదేవిధంగా వీ.హనుమంతరావు, మధుయాష్కి గౌడ్, జీవన్ రెడ్డి, షబ్బీర్ అలీ, సంపత్, బెలయ్య నాయక్ వంటి నేతలు కూడా అవకాశాల కోసం ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద ఈ రాజ్యసభ పోరు సంఖ్యాబలం మాత్రమే కాదు, సామాజిక సమీకరణాలు మరియు రాజకీయ వ్యూహాల మధ్య జరుగుతున్న కీలక పోరాటంగా మారింది.



## సౌందరరాజన్ మృతికి కేటీఆర్ సంతాపం

**ముద్ర, హైదరాబాద్ :**



చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు సి.ఎస్. సౌందరరాజన్ మృతి పట్ల బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 'చిలుకూరు సౌందరరాజన్'గా సుపరిచితులైన ఆయన మరణ వార్త తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. చిలుకూరు క్షేత్ర అభివృద్ధిలో, భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శనం చేయడంలో సౌందరరాజన్ గారి సేవలు మరువలేనివని కేటీఆర్ కొనియాడారు. పూజా కార్యక్రమాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజంలోని మూఢ నమ్మకాలపై పోరాడుతూ, 'దళిత గోవిందం' వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక సమరసతకు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. సౌందరరాజన్ గారి మరణం ఆధ్యాత్మిక రంగానికి తీరని లోటు అని పేర్కొన్న కేటీఆర్, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు, చిలుకూరు బాలాజీ భక్తులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# అనుకోని బహుమతి

(మొదటి పేజీ తరువాయి)

సమీర్ మహేంద్రు, అమన్దీప్ సింగ్ దాల్, అర్జున్ పాండే, గోరంట్ల బుచ్చిబాబు, రాజేష్ జోషి, దామోదర్ ప్రసాద్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చంప్రీత్ సింగ్ రాయట్, దుర్గేష్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశిష్ చాంద్ మథుర్, శరత్ చంద్రా రెడ్డిలను డిశ్చార్జి చేశారు.

**క్లీన్ చిట్**

ఢిల్లీ లిక్కర్ స్కాం (ఎక్సైజ్ పాలసీ కేసు)లో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా సహా మొత్తం 23 మంది నిందితులకు భారీ ఊరట లభించింది. శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు స్పెషల్ జడ్జి జితేంద్ర సింగ్ కీలక తీర్పు వెలువరించి, సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్ షీట్‌లో మెరిట్ లేదని, సరైన సాక్ష్యాలు లేకపోవడంతో కేసును కొట్టివేశారు.ఈ కేసులో సమీర్ మహేంద్రు, అమన్దీప్ సింగ్ దాల్, అర్జున్ పాండే, గోరంట్ల బుచ్చిబాబు, రాజేష్ జోషి, దామోదర్ ప్రసాద్ శర్మ, ప్రిన్స్ కుమార్ తదితరులను కూడా డిశ్చార్జ్ చేశారు. కోర్టు ప్రకారం ఆరోపణలకు బలమైన ఆధారాలు లేవు, కుట్రకు సంబంధించిన ఎలాంటి సబ్స్టాన్షియల్ ఎవిడెన్స్ లేదని స్పష్టం చేసింది. దీంతో ప్రైమా ఫేసి కేసు కూడా లేదని తేల్చింది. ఈ తీర్పుతో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు కూడా బిగ్ రిలీఫ్ లభించింది. ఇదే కేసులో ఆమెపై కూడా ఆరోపణలు ఉండగా, సాక్ష్యాలు లేవని కోర్టు అభిప్రాయం వ్యక్తం చేయడంతో ఆమెకు ఊరట లభించింది. కేజ్రీవాల్ ఈ తీర్పుపై స్పందిస్తూ "నాపై తప్పుడు ఆరోపణలు చేశారు... సత్యం గెలిచింది" అని అన్నారు. 202122 ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో అక్రమాలు జరిగాయని, రూ.100 కోట్ల కిక్‌బ్యాక్‌లు తీసుకున్నారని సీబీఐ ఆరోపించింది. కానీ ఆ ఆరోపణలను సమర్థించే మెటీరియల్ లేదని కోర్టు తేల్చింది. ఈ తీర్పు రాజకీయంగా కూడా ప్రభావం చూపనుంది. కేసు కారణంగా ఎన్నికల్లో నష్టం చవిచూసిన ఆప్‌కు ఇది నైతిక బలం ఇస్తోంది. ఇక కేజ్రీవాల్ మళ్లీ రాజకీయంగా యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక కవిత విషయానికి వస్తే, ఈ కేసులో నిర్దోషిగా తేలడంతో ఆమెకు కొత్త ఊపిరి వచ్చింది. జైలులో గడిపిన కాలం, ఎదుర్కొన్న అవమానాల తర్వాత "సత్యం గెలిచింది" అంటూ ఆమె స్పందించారు. ఈ పరిణామాలతో ఆమె రాజకీయంగా మరింత జోరుగా ముందుకు సాగే అవకాశాలు ఉన్నాయి. అయితే ఈ తీర్పు బీఆర్ఎస్‌లో కొత్త చర్చలకు దారి తీసింది. కేటీఆర్ చేసిన ట్వీట్‌పై కవిత ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పార్టీ ఓటమికి తనను కారణం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. తాను పార్టీ కోసం ఇబ్బందులు పడినా, ఆ సమయంలో సరైన మద్దతు లభించలేదని అన్నారు. దీంతో అన్నాచెల్లెళ్ల మధ్య విభేదాలు బయటపడినట్లయ్యాయి. ఒకవైపు కేసులో ఊరట వచ్చినా, మరోవైపు బీఆర్ఎస్‌లో అంతర్గత రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. ఇక కవిత త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# మళ్లీ పెడదోవ పట్టొద్దు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్ట పరిధిలో ఏ పనైనా చేసుకోవచ్చని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, ఇతరులను భయభ్రాంతులకు గురి చేస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని పేర్కొన్నారు. ఏళ్ల క్రితం అడవుల్లోకి వెళ్లి, ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేస్తానని తెలిపారు. శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయిన అగ్రనేతలు తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ), మల్లా రాజిరెడ్డి (సంగ్రామ్), పుల్లూరి ప్రసాదరావు (చంద్రన్న), పోతుల కల్పన (సుజాత), బడే చొక్కారావు (దామోదర్), నూనె నర్సింహారెడ్డి (గంగన్న) భేటీ అయ్యారు. దాదాపు గంటన్నరకు పైగా చర్చలు జరిపి కీలక అంశాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టులు రాజకీయ అంశాలపై చర్చించారు. జనజీవన స్రవంతిలోకి రావడానికి సహకరించిన సీఎం, డీజీపీ, ఐజీ సుమతికి దేవ్‌జీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సర్కారు సరెండర్ పాలసీని ప్రశంసించారు. అనుమతి ఇస్తే జైళ్లలో ఉన్న మావోయిస్టులను కలుసుకుని, లొంగుబాట్లపై ప్రజలకు బహిరంగ లేఖ రాస్తామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ సిద్ధాంతం సరైన మార్గం కాదని ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డ్‌ను రూ.కోటికి పెంచాలని, 5 ఎకరాల భూమి ఇవ్వాలని కోరినట్లు దేవ్‌జీ తెలిపారు. అయితే భూమి ఇవ్వడం సాధ్యం కాదని ప్రభుత్వం చెప్పిందన్నారు. ఇల్లు, ఉద్యోగం, జీవనభృతి కల్పిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్చి 31 నాటికి దేశవ్యాప్తంగా మావోయిస్టులను నిర్మూలిస్తామని ప్రకటించిన నేపథ్యంలో 'ఆపరేషన్ కగార్' కొనసాగుతోంది. ఈ క్రమంలో మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రాలు లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నాయి. ఇటీవల తెలంగాణలో పలువురు మావోయిస్టులు లొంగిపోయారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఏడీజీ విజయ్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఐజీ సుమతి పాల్గొన్నారు.



## చంద్రబాబును ఆహ్వానించిన భట్టి, శ్రీధర్ బాబు

ముద్ర న్యూస్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు క్యాంప్ కార్యాలయంలో కలిశారు. మార్చి 5వ తేదీన హైదరాబాద్‌లో జరిగే తన కుమారుడు సూర్యవిక్రమాదిత్య వివాహ కార్యక్రమానికి సీఎం చంద్రబాబును భట్టి విక్రమార్క ఆహ్వానించారు.

# తెలంగాణ అభివృద్ధి కోసం కలిసి నడుద్దాం : ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర హైదరాబాద్ :**

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (BAI) ఆధ్వర్యంలో 4వ నేషనల్ మేనేజింగ్ కమిటీ (MC), జనరల్ కౌన్సిల్ (GC) 2026 సమావేశాలు నగరంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రోడ్డులో ఉన్న పద్మజా పామ్ గ్రోవ్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల్లో భాగంగా నిర్వహించిన 'బిల్డర్స్ డే' వేడుకలు, ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ రహదారుల నిర్మాణం నుంచి భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల వరకు బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఎదుర్కొనే సవాళ్లకు తాను ప్రత్యక్ష సాక్షినని పేర్కొన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని హామీ ఇచ్చారు. స్వాతంత్ర్యానికి ముందే స్థాపించబడిన బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా దేశంలోనే అత్యంత పురాతన సంస్థగా దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా సేవలందిస్తోందని ఆయన అన్నారు. ఈ సంస్థ కాంట్రాక్టర్లు మరియు ప్రభుత్వానికి మధ్య కీలక వారధిగా పనిచేస్తోందని కొనియాడారు. ఆర్థికాభివృద్ధికి రహదారులు, వంతెనలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, గృహ నిర్మాణం వంటి మౌలిక వసతుల అభివృద్ధి ఎంతో అవసరమని, అందులో బిల్డర్లు, కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని గుర్తు చేశారు. తాను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలం ప్రజాజీవితంలో కొనసాగి, ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీగా పనిచేసిన విషయాన్ని గుర్తు చేశారు.





అలాగే క్యాబినెట్ మంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలోనూ, తెలంగాణలోనూ సేవలందించానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఏడు సార్లు అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో కాంట్రాక్టర్లు, బిల్డర్ల సమస్యలు తనకు బాగా తెలుసని చెప్పారు. ఇరిగేషన్ మంత్రిగా చెల్లింపులు, ఇతర సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ఈ సమావేశాల్లో లేవనెత్తే అన్ని అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని హామీ ఇచ్చారు. గత పదేళ్లలో ఏర్పడిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. "మేము గత పాలకుల్లా కాదు.. మీకు 24 గంటలూ అందుబాటులో ఉంటాం" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంజనీరింగ్, కన్స్ట్రక్షన్ రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి పురస్కారాలు అందించడం ఆనందదాయకమని మంత్రి తెలిపారు. దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా నిలపడానికి ఇలాంటి సమావేశాలు దోహదం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోసియేషన్‌కు సహకారం అందిస్తున్న కెఎల్ఆర్, నర్సింహారెడ్డి తదితరులను అభినందించారు. ఈ సమావేశాలకు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు రాజేంద్ర సింగ్ కంబో, ఐఎఫ్ఏడబ్ల్యూపీసీఏ బోర్డు సభ్యుడు ఎస్.ఎన్. రెడ్డి, బీఏఐ జాతీయ ఉపాధ్యక్షుడు డి.వి.ఎన్. రెడ్డి తదితరులు హాజరయ్యారు. నల్గొండ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఎస్. కృష్ణారావు, బీఏఐ మాజీ చైర్మన్ బి. సీనయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
28.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 మేధావులు**

**2. ఐజాక్ న్యూటన్**

గురుత్వాకర్షణ నియమాలను కనుగొని శాస్త్రానికి పునాది వేశాడు. క్యాల్కులస్ అభివృద్ధి ద్వారా గణితశాస్త్రాన్ని విస్తరించాడు.



# సత్యమే గెలిచింది..

- **మద్యం కేసులో కవితకు క్లీన్ చిట్ పట్ల కేటీఆర్ హర్షం**

**ముద్ర, తెలంగాణ:**



మద్యం కుంభకోణం సాకుతో దేశంలో ప్రధానంగా కొట్లాడుతున్న రాజకీయ పార్టీలు, నాయకులను దెబ్బతీసేందుకు ప్రయత్నించారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఆ ప్రయత్నాలతో బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయిందని గుర్తుచేశారు. ఇదే విధంగా తమ నాయకులపై నమోదైన ప్రతి కేసు కూడా ఒక అబద్ధమని ప్రకటించారు. చివరికి సత్యమే గెలుస్తుందని తెలిపారు. కానీ ఆరోపణలకు ప్రాధాన్యమిస్తూ..న్యాయ ప్రక్రియ కంటే మీడియా ధోరణితో తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని తెలిపారు. మద్యం కుంభకోణంలో కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. 'మద్యం కుంభకోణం అనే సాకుతో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారని అన్నారు. ఆ కేసుతో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయంగా నష్టపోయింది మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీ అని అన్నారు. కవితకి ఈ రోజు కోర్టులో న్యాయం జరిగింది' అని కేటీఆర్ ప్రకటించారు. 'ఇదే విధంగా మా నాయకులపై నమోదైన ప్రతి కేసు కూడా అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే తేలిపోతుంది' అని ధీమా వ్యక్తం చేశారు. 'సత్యం గెలిచే వరకు, కాంగ్రెస్, బీజేపీలు చేసే బాధ్యతారహితమైన ఆరోపణలను మనం చూశాం. అసత్యపూరిత.. కుట్రపూరిత కేసులను ఆరోపణలను మీడియా ట్రయల్స్ ద్వారా మరింత పెద్దవి చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, మా ప్రతిష్టను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారు' అని బీజేపీ, కాంగ్రెస్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దురదృష్టవశాత్తూ సాక్ష్యాల కంటే ఆరోపణలకే ప్రాధాన్యమిస్తూ.. న్యాయ ప్రక్రియ కంటే మీడియా కథనాలే మిన్న అనే ధోరణి ఈ నవ భారతంలో అలవాటుగా మారిపోయింది' అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కానీ చివరికి, న్యాయమే గెలుస్తుంది అని ప్రకటించారు.

మద్యం కుంభకోణంలో జైలులో గడిపిన చెల్లెమ్మ కవిత కూడా బయటపడడంతో కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కవితకు న్యాయం జరిగిందని ప్రత్యేకంగా గుర్తుచేశారు.





# శాస్త్రోక్తంగా మహా పూర్ణాహుతి, చక్రతీర్థం

- **కొనసాగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు**

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాదనల అనంతరం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం కార్యక్రమాలను శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారంగా ఆలయప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చకబృందం పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలలో దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టరు ఎం.హనుమంతరావు, కార్యనిర్వహణాధికారి జె.భవానీశంకర్, ఆలయ అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి, ఉప కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు, ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

**మహాపూర్ణాహుతి ప్రత్యేకత**

"ఓం పూర్ణమద: పూర్ణమిదః పూర్ణాత్ పూర్ణముదచ్యతే" అని సంకల్పించి పూర్ణాహుతి ఫలమును భగవత్ అర్పణము గావించి సమస్త లోకములు సుఖ శాంతి మయములు కావాలని కోరుకొనుచూ, వసోర్ధార మొదలగు మంత్రములతో లోకంలో సువృష్టిని కురిపించమని భగవానుని వేడుకొని ఎంతో భక్తిభరితంగా ఈ కార్యక్రమాలను నిర్వహించెదరు.

**చక్రతీర్ధం ప్రత్యేకత**

శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవంలో చక్రతీర్ధము (అవభృథ మహోత్సవము) ఎంతో ప్రత్యేకతను కలిగి ఉన్నది. శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లను ప్రతినిత్యము ఆగమశాస్త్రానుసారంగా ఆరాధన నిర్వహించి ఉత్సవాంతమున పంచామృత స్నపన తిరుమంజన వేడుకలు నిర్వహించి అనంతరము శ్రీ స్వామివారి పుష్కరిణిలో పవిత్ర స్నానము గావించిన సుదర్శన చక్ర ప్రభావం వలన తీర్థరాజము అత్యంత పవిత్రతను పొందును. ఈ జలములలో భక్తులు స్నానామాచరించిన ఎంతో పుణ్య ప్రదమని శాస్త్రోక్తము

**సాయంకాల కార్యక్రమాలు**

శుక్రవారం సాయంకాలం శ్రీ స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవము కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞా చార్యులు, అర్చక బృందం, వేద పండితులు, పారాయణీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. సర్వవిధ దోషములను తొలగించుటకు గాను ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగం నిర్వహించెదరు. పుష్పం పరిమళం రెండును భగవంతుని స్వరూపమని వాటిని భక్తిపూర్వకంగా భగవంతునికి సమర్పించిన జన్మరాహిత్యం కలుగునని కపింజల సంహిత తెలియజేయుచున్నది. ఉత్సవాల దేవుడికి నిర్వహించబడు శ్రీ పుష్పయాగ మహోత్సవమునకు దేవకోటి విచ్చేసి వీక్షించి అనుగ్రహం పొందుట పురాణ ప్రసిద్ధం.

# వాళ్లు నిర్దోషులు కారు..

- **సాంకేతిక కారణాలతోనే రౌస్ అవెన్యూ కోర్టు తీర్పిచ్చింది**
- **సిబీఐ పై కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉంది**
- **ఢిల్లీ లిక్కర్ కేసుపై స్పందించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఢిల్లీ లిక్కర్ కేసును కొట్టివేస్తూ.. అక్కడి రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు ఇచ్చిన మాత్రానా నిందితులంతా తప్పు చేయలేదని అర్థం కాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వ్యాఖ్యానించారు. టెక్నికల్ కారణాలతోనే కేసును ఢిల్లీ కోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. అంత మాత్రం చేత ఢిల్లీ మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా ఇతర నిందితులుగా ఉన్న వారు.. తప్పు చేయలేదని అర్థం కాదని వెల్లడించారు. ఈ కేసును కోర్టు డిశ్చార్జ్ చేసినంత మాత్రాన వారు నిర్దోషులు అయిపోరు అని తెలిపారు. ఒకవేళ వారు అలా భావిస్తే.. ఇది వారి అమాయకత్వమే అవుతుందని విమర్శలు గుప్పించారు. శుక్రవారం రాత్రి ఆయన ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసుకు సంబంధించి.. తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై సీబీఐ త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటుందని రామచందర్ రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ.. పై కోర్టులో సవాల్ చేసే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. ప్రస్తుత తీర్పు కేవలం ట్రయల్ కోర్టు నుంచి వచ్చింది మాత్రమేనన్న ఆయన పై కోర్టుకు వెళ్తే తీర్పు మారే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

**కవిత నిర్దోషని కోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదు : ఎంపీ అర్వింద్**

ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత నిర్దోషని రౌస్ అవెన్యూ కోర్టు క్లీన్ చిట్ ఇవ్వలేదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు. ఈ కేసులో కేవలం సాక్ష్యాలు లేవని మాత్రమే కోర్టు చెప్పిందన్న ఆయన అంతలోనే సంబరపడితే ఎలా అని ప్రశ్నించారు. శుక్రవారం నిజామాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కవిత చెబుతున్నట్లుగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకటి కాదని తేల్చి చెప్పారు. రాజకీయాల్లో చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతుంటారని, వాటన్నింటికీ సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు.

# నోటి దూలతో రోజుకోరకంగా..

- **తెలంగాణ ప్రభుత్వానికి సవాల్ విసిరిన యూట్యూబర్ అన్వేష్!**

**ముద్ర, డెస్క్ :**



గత కొంత కాలంగా యూట్యూబర్ అన్వేష్ సోషల్ మీడియాని వేదిక గా చేసుకొని చేస్తున్న కామెంట్స్ ఏ రేంజ్ లో జనాలకు కోపం తెప్పిస్తున్నాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. హీరో శివాజీ హీరోయిన్స్ ధరించే దుస్తులపై చేసిన వ్యాఖ్యలపై అన్వేష్ కౌంటర్లు ఇస్తూ, నోటి దూలతో శివాజీ వినలేని పదాలతో బూతులు తిట్టడమే కాకుండా, అదే ఫ్లోలో ఆయన హిందూ దేవుళ్ళ మీద కూడా అత్యంత దారుణమైన కామెంట్స్ చేశాడు. దీనికి హిందువులు మొత్తం అన్వేష్ పై తిరుగుబాటు చేసి పెద్ద ఎత్తున ఆయన సోషల్ మీడియా మాధ్యమాలను అన్ ఫాలో కొట్టడం మొదలు పెట్టారు. అప్పటి నుండి అన్వేష్ సైలెంట్ గా ఉన్న నన్ను గెలికారు, ఇక బత్తాయిలకు మామూలుగా ఉండదు అంటూ అప్పటి నుండి హిందువులపై టార్గెట్ చేస్తూ రోజుకి ఒక వీడియో ని విడుదల చేస్తూ ఉన్నాడు. ఇప్పుడు కొత్తగా ఇతగాడు విడుదల చేసిన వీడియో చూస్తే ఎవరికైనా రక్తం మరిగిపోతాది అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన మాట్లాడుతూ 'ఇండియా కి వస్తాను. ఇప్పటి వరకు 130 దేశాలు తిరిగాను, ఇంకా 70 దేశాలు ఉన్నాయి. 2035 వరకు నాకు పాస్ పోర్ట్ ఉంటుంది. ఆ తర్వాత రెన్యువల్ చేయించుకోవాలి, అప్పుడు మాత్రమే ఇండియా కి వస్తాను , లేదు నేను ఇప్పుడే రావాలి, నేను రావడం వల్ల దేశం అభివృద్ధి చెందుతుంది అనుకుంటే రప్పించుకోండి. మళ్లీ మళ్లీ చెప్తున్నాను, మీరు నా వెంట్రుకలు కూడా పీకలేరు. నేను వస్తే పోలీసులు అరెస్ట్ చేయడానికి రెడీ గా ఉన్నారట. నేను విధింపుచ్చుకొని బయటకు రావడానికి నా దగ్గర లాయర్లు లేరా ?, నేను ఏమైనా మర్డర్లు చేశానా ?, లేదా వేరే ఏమైనా చేశానా?, ప్రపంచంలో ఎన్నో దేశాలు తిరిగి జనాలకు చూపించాను, రామాయణం, మహాభారతం బోధించాను, నాకు తోచినంత సహాయం చేసుకుంటూ వచ్చాను, సమాజానికి ఉపయోగపడే పనులే చేస్తూ వచ్చాను, కాస్త నోటి దూల ఉండేది, అది కూడా ఇప్పుడు తగ్గించుకున్నాను, పెద్ద పెద్ద ఘోరాలు చేసినోళ్లే బయట మీసాలు మెలేస్తూ తిరుగుతున్నారు. అలాంటిది నాకెందుకు భయం, మళ్లీ మళ్లీ చెప్తున బత్తాయిలు, మీరు నా వెంట్రుక కూడా పీకలేరు ' అంటూ చెప్పుకొచ్చాడు.



# రేటింగ్స్.. సర్టిఫికేషన్

- **హోటళ్లలోని వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు**
- **వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలి**
- **తనిఖీల కోసం ప్రత్యేక మానిటరింగ్ వింగ్**
- **మున్సిపల్ సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

హైదరాబాద్ కోర్ రీజియన్ పరిధిలోని హోటళ్లలోని వంటగదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. హోటల్స్‌కు రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలన్న ఆయన ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్డ్ ఎక్విప్ మెంట్ వినియోగించాలని ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం సచివాలయంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న సీఎం.. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలన్నారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్ లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలన్నారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# బీకేఎస్ అఖిల భారత మహా సభలు ప్రారంభం

**ముద్ర,మేడ్చల్ జిల్లా ప్రతినిధి :**

మేడ్చల్ జిల్లా పరిధిలోని ఘట్కేసర్ అన్నోజిగూడలో ఉన్న రాష్ట్రీయ విద్యా కేంద్రం ఆడిటోరియంలో శుక్రవారం (భారతీయ కిసాన్ సంఘ్) మూడు రోజుల అఖిల భారత ప్రతినిధి సభ ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుండి సంఘ అధికార ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత మాత, భగవాన్ బలరాముడి చిత్రాల ముందు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రతినిధి సభను అధికారికంగా ప్రారంభించారు. అంతకుముందు దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రాంత వివిధ రాష్ట్రాల కిసాన్ సంగ్ నాయకుల సమక్షంలో ప్రాంగణంలో ధ్వజారోహణ నిర్వహించి గో పూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ సమావేశంలో అఖిల భారత అధ్యక్షుడు కె.సాయి రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం అఖిల భారత ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా ప్రధాన కార్యదర్శి నివేదికను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ఉపాధ్యక్షులు రాంభరోస్ బసోటియా, సుశీల విష్ణోయ్, పెరుమాళ్ మరియు విశాల్ చంద్రకర్ పాల్గొన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అఖిల భారత సంపర్క్ ప్రముఖ్ రాంలాల్ జీ, రాష్ట్ర ప్రచారక్ శ్రీధర్ జీ, అఖిల భారత సంస్థ మంత్రి దినేష్ కులకర్ణి, సహ సంస్థ మంత్రి గజేంద్ర సింగ్ తదితరులు హాజరయ్యారు.


**వ్యవసాయం–రైతు సమస్యలపై చర్చలు**

మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ అఖిల భారత ప్రతినిధి సభలో వ్యవసాయం, రైతులకు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. ముఖ్యంగా సాధారణ బడ్జెట్, విత్తన బిల్లు, పంట బీమా, సేంద్రీయ వ్యవసాయం, గో ఆధారిత వ్యవసాయ విధానాలు, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు, కిసాన్ సమ్మాన్ నిధి పెంపు, భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం, భూసేకరణ, దిగుమతి–ఎగుమతి విధానాలు, జీఎం విత్తనాలు మరియు ఇతర సంస్థాగత, నిర్మాణాత్మక అంశాలు చర్చకు రానున్నాయి.

# కాంగ్రెస్ అంటే కూల్చివేతలే

- **తీరు మారకపోతే ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చేస్తారు**
- **ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి**
- **రైతు భరోసా ఇవ్వకుంటే ఆందోళన చేస్తాం**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్**

**ముద్ర, కరీనగర్:**



ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇళ్లు నిర్మించింది. మోదీ పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో పోటీ పడుతుంటే... రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చే విషయంలో పోటీ పడుతోంది.' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. నానా కష్టాలు పేదలు అప్పోసప్పో చేసి బతకడానికి ఇండ్లు కట్టుకుంటే వాటిని కూల్చడం దుర్మార్గమని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పనితీరు మారకపోతే...రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేస్తారని చెప్పారు. తక్షణమే పేదల ఇళ్ల కూల్చివేతను ఆపాలని, లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం కరీంనగర్ లోని 51వ డివిజన్ లో రూ.16 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ భండారి వేణుసహా పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. స్థానిక కార్పొరేటర్ భండారి వేణును భారీ మెజారిటీ గెలిపించి నమ్మకం ఉంచి ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం కేంద్రం నుండి పెద్ద ఎత్తు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పారని, మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా వేస్తామని ఫిబ్రవరి 4న మిర్యాలగూడలో రేవంత్ రెడ్డే ప్రకటించారు. ఎన్నికలు ముగిశాక మాట మార్చారని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలొచ్చే టైంలో మళ్లీ ఏదో ఒక డ్రామాలాడతారు. రాష్ట్ర ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లో 6 గ్యారంటీలను అమలు చేయకపోయినా, డీఏలు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకపోయినా ఓట్లేశారు. దీంతో కాంగ్రెస్ నేతల్లో అహంకారం పెరిగిపోయింది. ఏ హామీని అమలు చేయకపోయినా ఓట్లేస్తున్నారని చెబుతున్నారు. అందుకే ఈసారి ప్రజలంతా కాంగ్రెస్ కు కర్రు కాల్చి వాత పెట్టాలి. రైతు భరోసా గురించి కేబినెట్ లో ఎందుకు చర్చించలేదని, ఆ పైసలు రైతుల ఖాతాల్లో వేసే ఆలోచన సీఎంకు లేదని అన్నారు. మూడు రైతు భరోసా వాయిదాలు కలిపితే రూ.27 వేల కోట్లు ఇవ్వాలని తెలిపారు. తక్షణమే రైతు భరోసాను చెల్లించాలని డిమాడ్ చేశారు. చెల్లించకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఆరోపించే రేవంత్ రెడ్డి, మంత్రులు ఎందుకు విచారణ చేపడంలేదని ప్రశ్నించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 28.02.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# మానవజాతి పురోగతికి మూలం సైన్స్

## ఫిబ్రవరి 28 అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం



నాగలి నుంచి హరిత విప్లవం దాకా, చక్రం నుంచి విమానం దాకా, నిప్పు నుంచి అణుబాంబు దాకా, నాటకాల నుంచి త్రీడి సినిమాల దాకా, బ్లాక్ అండ్ వైట్ టీవీల నుంచి ఎల్‌సీడీ, ఎల్‌ఈడీ దాకా, ఉత్తరాల మొదలుకొని సెల్‌ఫోన్, అంతర్జాలం వరకు ప్రపంచం అత్యున్నత దిశగా అడుగేసింది. నూతన వైజ్ఞానిక ఆవిష్కరణలతో మానవుడి జీవన పయనం సుఖమయంగా మారింది. మనిషి చంద్రలోకాన్ని జయించి ఇలను ఇంద్రలోకంగా మార్చి ప్రపంచాన్ని అరచేతిలో బంధించాడు. మానవజీవితంలో విజ్ఞానశాస్త్ర ప్రాముఖ్యత, ప్రాధాన్యత ఏమిటో అందరికీ తెలిసిన విషయమే. ఆదిమానవుడు నిప్పును కనిపెట్టడం దగ్గరి నుండి మొదలైన మానవాళి అభివృద్ధి నేటి కృత్రిమ మేధస్సు (AI) ని సృష్టించడం వెనక ఎంతోమంది శాస్త్రవేత్తల నిరంతర కృషి, అంకితభావం దాగి వున్నాయి అనేది నిర్వివాదాంశం. నిరంతరం సత్యాన్వేషణ చేస్తూ,శాస్త్రీయ దృక్పథంతో, నిశిత పరిశీలనతో విజ్ఞానశాస్త్ర ప్రగతికి బాటలు వేసిన, వేస్తున్న మహనీయులు శాస్త్రవేత్తలు. వేదకాలం నుండి మన భారతదేశం ఎంతోమంది గొప్ప శాస్త్రవేత్తలను ప్రపంచానికి అందిస్తూనే ఉంది. అలాంటి శాస్త్రవేత్తలలో మన భారతదేశ కీర్తిపతాకాన్ని విజ్ఞాన ప్రపంచంలో రెపరెపలాడించినవారు భారతరత్న సర్ సి.వి. రామన్. మనదేశ ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన ఆయన ఆవిష్కరణ 'రామన్ ఎఫెక్ట్' కనుగొన్న సందర్భంగా ఫిబ్రవరి 28న 'జాతీయ సైన్స్ దినోత్సవం' జరుపుకుంటున్నాం. మన దేశానికి భౌతికశాస్త్రంలో మొదటిసారిగా నోబెల్ బహుమతిని అందించిన సి.వి. రామన్ అద్భుత ఆవిష్కరణ "రామన్ ఎఫెక్ట్"ను కనుగొన్నందుకు గుర్తుగా మనదేశంలో ప్రయోగాలకు, పరిశోధనలకు మరింత ఊతమిచ్చేందుకుగాను 1986లో నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ & టెక్నాలజీ కమ్యూనికేషన్ ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపు కోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఫలితంగా మొట్టమొదటి జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఫిబ్రవరి 28, 1987న జరుపు కోవడం జరిగింది. నాటినుండి ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఆరోజున దేశంలోని అన్ని విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు పరిశోధనా సంస్థల్లో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రాతి గుహాలు, చెట్ల తొర్రల్లో నివసించిన ఆదిమానవుల కాలం నుంచి ప్రస్తుత వర్తక వ్యాపారాలు, నివాసాలకు అనుకూలంగా అతి తక్కువ స్థలంలో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాలు విజ్ఞానశాస్త్ర ప్రగతికి నిదర్శనాలు.ఎరువుల కార్మాగారాలు,విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు,చమురు శుద్ధి,ఉక్కు కార్మాగారాలు, ఔషధ తయారీ పరిశ్రమలు,వాహనాల పరిశ్రమలన్నీ విజ్ఞాన శాస్త్ర ఫలితమే.ఆహారోత్పత్తిలో హరిత విప్లవానికి దారి తీసిన మేలు రకం వరి, గోధుమ, జొన్న వంటి కొత్త వంగడాల రూపకల్పనంతా సైన్స్ ఫలితమే. రవాణా రంగంలో ఊహించని మార్పులు సైన్స్ ఫలితమే.ఎద్దుల బండితో మొదలైన మానవుడి ప్రయాణం సైకిల్, మోటారు సైకిల్, కారు, రైలు, ఓడ, విమానం వంటి అత్యాధునిక ప్రయాణ సాధనాలతో సమాజం వేగవంతమయ్యింది. క్యాన్సర్, ఎయిడ్స్ వంటి అంతుచిక్కని వ్యాధులకు మందులను కనిపెట్టడం సైన్స్ వల్లే సాధ్యపడింది. మానవ జీవనాన్ని విలాసావంతం చేసిన సినిమాలు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు ఇవన్నీ సైన్స్ ఫలితమే.చిన్న చిన్న ముద్రణ యంత్రాలను మొదలుకుని అనేక వేల పత్రిక ప్రతులను ఒకే సారి అచ్చు వేసే యంత్రాలు, టెలీ ప్రింటర్ వార్తలు, కార్టూన్ బొమ్మలు సైన్స్‌తోనే అందుబాటులోకి వచ్చాయి. సైన్స్ కారణంగా మానవుడు విలాసావంతమైన జీవితం ఆరంభించడం బాగానే ఉంది. విజ్ఞాన శాస్త్రం అనేక సమస్యలను పరిష్కరించడంలో మానవ జీవితాన్ని సుఖవంతం చేసింది. కాని, మనిషి విచక్షణ లోపం వల్ల ఆ విజ్ఞానమే పరిసరాల కాలుష్యం, పర్యావరణ అసమౌతులత్యకు దారి తీస్తున్నది. అణువస్త్రం అనే మారణాయుధాయులను సృష్టించడంతో మానవులతో పాటు జీవరాసుల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నది. సైన్స్‌తోనే అణు బాంబులను తయారు చేసి జనం ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ఈ బాంబులను సైన్స్ పరిజ్ఞా నంతోనే తయారు చేశారు. మానవుడిలో విచక్షణ లోపిం చి ఇలా మారణహోమాలను సృష్టించడం మేధా వులతో సామాన్యులు కూడా తప్పుపడుతున్నారు. మానవుడు తన విజ్ఞానాన్ని సరైన మార్గంలో వినియోగించి సృష్టి ఔనత్యా నికి పాటుపడాలే కాని, సృష్టి వినాశనానికి సైన్స్‌ను ఉపయోగించకూడదు. సైన్స్ డే సందర్భంగా ఈ విషయమై ఆలోచించా ల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

సర్ సి.వి. రామన్ అందరికీ సుపరిచితుడైన చంద్రశేఖర్ వెంకట రామన్ 1888 నవంబర్ 7న తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలోని గ్రామంలో చంద్రశేఖర్ అయ్యర్, పార్వతీ అమ్మాళ్ అనే బ్రాహ్మణ దంపతులకు రెండవ సంతానంగా జన్మించాడు. చిన్ననాటి నుండే రామన్ కు విజ్ఞానశాస్త్ర విషయాలపట్ల ఉన్న ఆసక్తి, అభిరుచిని చూసి ఉప ధ్యాయులు ఆశ్చర్య పోయేవారు. తన తండ్రి కూడా భౌతికశాస్త్ర అధ్యాపకులు కావడం సి.వి. రామన్ భౌతికశాస్త్రంలో మేటి శాస్త్రవేత్తగా ఎదగటానికి దోహదపడిన అంశం. తన 12వ ఏట మెట్రిక్యులేషన్ పూర్తిచేసి భౌతికశాస్త్రంలో గోల్డ్ మెడల్ సాధించాడు. 1907వ సం.లో ఎంఎస్సీ భౌతికశాస్త్రంలో యూనివర్సిటీ ప్రథముడిగా నిలిచాడు. సర్ సి.వి. రామన్ మొట్టమొదటి పరిశోధనా వ్యాసం కాంతికి సంబంధించిన ధర్మాలపై 'ఫిలాసాఫికల్ మేగజైన్' అనే పత్రికలో ప్రచురితమైనది. రామన్ లోని పరిశోధనాసక్తిని, కుతూహలాన్ని గమనించిన అధ్యాప కులు పరిశోధనలకు లండన్ వెళ్ళమని సూచించినా, ఆరోగ్యరీత్యా తను లండన్ ప్రయాణాన్ని విరమించుకున్నాడు. తల్లిదండ్రుల కోరిక మేరకు I.C.S.S ఉత్తీర్ణుడై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ గా ఉద్యోగంలో చేరినా తన పరిశోధన తృష్ణ, భౌతికశాస్త్రం పట్ల ఉన్న మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర ప్రొఫెసర్ గా చేరి తన పరిశోధనలు కొనసా గించాడు.

రామన్ తన ప్రయోగాల్ని కాంతి వివర్తనం,కాంతి విక్షేపం పై చేశారు. ద్రవపదార్థాలపై పడిన కాంతి కిరణాలు ప్రక్షేపం చెందుతాయని, ఆ కాంతి కిరణాల్లోని ఫోటాన్ కణాలలో కొన్ని వాటి పూర్వపు తరచుదనాన్ని కోల్పోక, కొన్ని మాత్రం తక్కువ పౌనఃపున్యంతో పరిక్షేపం చెందుతాయని కనుగొన్నాడు. దీనినే 'రామన్ ఎఫెక్ట్' అంటారు. దీనికిగాను 1930లో నోబెల్ బహుమతిని అందుకున్నాడు. వైద్యరంగంలో రసాయన శాస్త్రంలో రామన్ ఎఫెక్ట్ ఉపయోగాలు ఎన్నో వున్నాయి. సముద్రం నీరు, ఆకాశం నీలిరంగులో ఉండటానికి గల కారణాలను రామన్ ఎఫెక్ట్ వివరిస్తుంది.


1999వ సంవత్సరం నుండి ఒక ఇతివృత్తం ఆధారంగా సైన్స్ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సంవత్సరం "సైన్స్ పై ప్రజల నమ్మకాన్ని పెంపొందించడం' అనే ఇతివృత్తం డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ ఎంచుకుంది. శాస్త్రవేత్తలందరూ విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన ప్రాజెక్టులలో కలిసి పనిచేయడం, సైన్స్ ప్రాముఖ్యతను మరియు నిజజీవితంలో సైన్స్ ఉపయోగాలను హైలెట్ చేయడం ఈ ఇతివృత్తం ముఖ్య ఉద్దేశ్యం.

సర్ సి.వి. రామన్ 1930లో నోబెల్ బహుమతి సాధించినప్పటినుండి ఇప్పటివరకు తొమ్మిది దశాబ్దాలకు పైగా గడిచినా భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతిని అందుకోవడం కలగానే మిగిలింది. సుబ్రహ్మణ్యన్ చంద్రశేఖర్, వెంకట్రామన్ రామకృష్ణలు నోబెల్ బహుమతి సాధించినా వారు విదేశాల్లో స్థిరపడ్డ భారత సంతతికి చెందిన వారు. కావడం గమనార్హం. పాఠశాల స్థాయినుండే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, పరిశీలనాదృష్టిని పెంపొం దించడం, ప్రయోగాలను ప్రోత్సహించడం ద్వారానే శాస్త్రవేత్తలను తయారుచేయగలమనే సత్యాన్ని గుర్తించాలి. తగు నిధులు సమకూ ర్చాల్సిన బాధ్యత ప్రభు త్వానిది. అయితే విద్యార్థులలో శాస్త్రీ య వైఖరిని పెంపొం దించాల్సిన బాధ్యత, ప్రోత్స హించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని చెప్పక తప్పదు. కేవలం ర్యాం కు లు, మార్కులకోసం కాకుం డా విద్యార్థుల్ని వారి అభిరు చి ఉన్న రంగంలో ప్రోత్స హి స్తేనే అద్భుతాల్ని ఆవిష్క రించగలం అని తల్లిదం డ్రులు కూడా ఆలోచిం చాల్సిన అవసరం ఉంది.



సుధాకర్.ఏ.వి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్
తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# మీలో ఆలోచన మొదలైతే ఏదైనా సాధ్యమే...!



ప్రయత్నం చేస్తేనే మన ఉనికి ఈ భూమిపైకి వచ్చింది. పుట్టిన వెంటనే చలనం లేకపోతే వైద్యులు కదిలించే ప్రయత్నం చేస్తారు. కొద్దిరోజులకు నిలబడటానికి ప్రయత్నిస్తాం. ఆ క్రమంలో తల్లిదండ్రుల చేతులను ఆసరాగా తీసుకుంటాం. అందుకే నిరంతర ప్రయత్నం చేస్తే "విధి" కూడా మారి మనకు అనుకూలంగా మారుతుంది. ప్రయత్నాలే సక్సెస్‌కు బాటలు వేస్తాయి. ప్రయత్నం చేయకపోతే ఓటమి మన వాకిట్లోనే ఉంటుంది. కర్మ అనేది మన ప్రయత్నాలపై ఆధారపడి ఫలితాన్ని ఇస్తుంది. ఏమి చేయకుండా ఫలితం ఆశించడం సాధ్యం కాదు. కాబట్టి వివేకం, విచక్షణతో లక్ష్య సాధనకు కృషి చేయాలి.

ఒకసారి గౌతమ బుద్ధుడు తన శిష్యులతో గ్రామంలో ఉన్నప్పుడు ఓ యువకుడు జీవితంలో గొప్పది ఏమిటి, సమయాన్ని ఎలా ఉపయోగించుకోవాలని అడిగాడు. మరుసటి రోజు ఉదయం రావాలని చెప్పిన బుద్ధుడు అతడిని తోటకు తీసుకెళ్లి ఒక పువ్వు తెమ్మన్నాడు. ఉదయం తీసుకొచ్చిన పువ్వు తాజాగా ఉండగా, మధ్యాహ్నం తీసుకొచ్చింది వాడిపోయి ఉంటుంది. "సమయం కూడా ఇదేలా ఉంటుంది. దానిని సద్వినియోగం చేసుకుంటే జీవితం అందంగా ఉంటుంది, లేదంటే వృథా అవుతుంది" అని బుద్ధుడు చెప్పాడు. కాలాన్ని గౌరవించే వారే సఫలమవుతారు.

దక్షిణాఫ్రికాలో న్యాయవాదిగా ఉన్న మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ, తరువాత మహాత్మా గాంధీగా మారి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు. శివాజీరావ్ గైక్వాడ్ అనే బస్సు కండక్టర్, రజనీకాంత్‌గా మారి సూపర్ స్టార్ అయ్యారు. రామేశ్వరం లో పేపర్లు అమ్మిన బాలుడు ఏపీజే అబ్దుల్ కలాం గా దేశ రాష్ట్రపతిగా ఎదిగారు. రైల్వే స్టేషన్‌లో టీ అమ్మిన వ్యక్తి నరేంద్ర మోడీగా దేశ ప్రధానిగా నిలిచారు.

నెల్సన్ మండేలా 27 ఏళ్లు జైలు జీవితం గడిపి దక్షిణాఫ్రికా అధ్యక్షుడయ్యాడు. మలాలా యూసుఫ్‌జై తీవ్రవాదుల దాడి నుంచి బయటపడి బాలికల విద్య కోసం పోరాడి నోబెల్ బహుమతి అందుకుంది. స్టీఫెన్ హాకింగ్ తన వైకల్యాన్ని జయించి ప్రపంచానికి గొప్ప పరిశోధనలు అందించాడు. బి.ఆర్. అంబేద్కర్ వివక్షను ఎదుర్కొని రాజ్యాంగాన్ని రచించాడు. జాక్ మా ఎన్నో విఫలాల తర్వాత అలీబాబాను స్థాపించాడు. థామస్ ఎడిసన్ వేల ప్రయత్నాల తర్వాత బల్బును కనిపెట్టాడు. జెఫ్ బెజోస్ చిన్న స్థాయి నుండి అమెజాన్‌ను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాడు. నిక్ వుజిసిక్ తన వైకల్యాన్ని అధిగమించి ప్రేరణగా నిలిచాడు. ఎలాన్ మాస్క్, స్టీవ్ జాబ్స్ వంటి వారు ఆలోచనతో ప్రపంచాన్ని మార్చారు.

ఇంతటి గొప్ప వ్యక్తుల జీవితాలను చూసినప్పుడు మన సమస్యలు చిన్నవే. చదువు, ఉద్యోగం, జీవన స్థిరత్వం వంటి సవాళ్లకే మనం నిరాశ చెందుతుంటాం. కానీ సానుకూలంగా ఆలో చించి, సమయాన్ని సద్విని యోగం చేసుకుంటే ఏదైనా సాధ్య మే. ప్రయత్నమే జీవి తం. నిరంతర కృషితో మీరు కూడా ప్రపంచం గర్వించే స్థాయికి చేరుకోవచ్చు.



డాక్టర్ మహ్మద్ హసన్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్ నెం.9908059234.

# స్మార్ట్ ప్రగతికి పునాది సైన్స్ అండ్ టెక్నాలజీ

(నేడు "జాతీయ వైజ్ఞానిక శాస్త్ర దినోత్సవం" సందర్భంగా)



మానవజాతి పాత రాతియుగం నుంచి నేటి డిజిటల్ ఏఐ యుగం వరకు అద్భుతమైన ప్రగతి సాధించింది. అంతర్జాలం భూమిని కుగ్రామంగా మార్చగా, ట్రంక్ కాల్, ల్యాండ్ ఫోన్, టేప్ రికార్డర్, సిడి ప్లేయర్, బ్లాక్ అండ్ వైట్ టీవీ వంటి పరికరాలు చరిత్రలో కలిసిపోయాయి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ మన జీవితంలో భాగమైంది. కమ్యూనికేషన్ విప్లవంతో ప్రపంచ సమాచారం మన అరచేతిలోకి వచ్చింది. ఈ మార్పులన్నింటికి పునాది సైన్స్ కాగా, దాని అనువర్తనం టెక్నాలజీ. సైన్స్ వేర్లు అయితే టెక్నాలజీ పండ్లు.

### రామన్ ఎఫెక్ట్- నోబెల్ గౌరవం

భారత శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్ 1928 ఫిబ్రవరి 28న "రామన్ ఎఫెక్ట్"ను కనుగొని 1930లో నోబెల్ బహుమతి పొందారు. ఈ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏడాది ఫిబ్రవరి 28న జాతీయ వైజ్ఞానిక శాస్త్ర దినోత్సవం జరుపుకుంటారు. సైన్స్ పరిశోధనలే టెక్నాలజీ అభివృద్ధికి మూలం.

### 2026 ఇతివృత్తం

ఈ సంవత్సరం థీమ్ "వైజ్ఞానికశాస్త్రంలో మహిళలు : వికసిత్ భారత్ లక్ష్యాలకు ఉత్ప్రేరకాలు". మహిళలను సైన్స్ రంగాల్లో ప్రోత్సహించడం, యువతలో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించడం ముఖ్య లక్ష్యాలు. పాఠశాలల్లో పోటీలు, ప్రయోగశాలలు, ప్లానిటోరియంల సందర్శనలు నిర్వహించాలి.

### భారత మహిళా శాస్త్రవేత్తలు

ఆసిమా ఛటర్జీ, జానకి అమ్మాళ్, అన్నా మణి, కమలా సోహోనీ, రీతు కరిధాల్, టెస్సీ థామస్, గగన్‌దీప్ కాంగ్, నందిని హరినాథ్ వంటి మహిళలు భారత సైన్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. కల్పన చావ్లా, ఇందిరా హిందుజా, ఆనందీబాయి జోషీ లాంటి వారు యువతకు స్ఫూర్తి.

### సి.వి. రామన్ జీవితం

1888లో జన్మించిన రామన్ భౌతికశాస్త్రంలో ప్రముఖ పరిశోధనలు చేసి "రామన్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్"ను స్థాపించారు. భారతరత్నతో పాటు అనేక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. సైన్స్ మానవ సంక్షేమానికి కూడా, విధ్వంసానికి కూడా ఉపయోగపడుతుంది. యువ త సైన్స్ మార్గంలో ముందు కు సాగి, దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలని ఈ దినోత్సవం సందేశం.



డాక్టర్: బుర్ర మధుసూదన్ రెడ్డి
సామాజిక విశ్లేషకులు
9949700037

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


టాప్ 10 మేధావులు

3. లియోనార్డో డా విన్సీ

చిత్రకళ, శాస్త్రం, ఇంజినీరింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచాడు. మోనాలిసా వంటి కళాఖండాలతో పాటు అనేక ఆవిష్కరణల రూపకల్పన చేశాడు.

# కొలువుదీరిన కొత్త పాలకవర్గం

- బాధ్యతలు చేపట్టిన మేయర్, డిప్యూటీ మేయర్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



నూతనంగా ఏర్పాటైన మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త పాలకవర్గం శుక్రవారం బాధ్యతలు చేపట్టింది. మేయర్ గా మమత, డిప్యూటీ మేయర్ గా సురేందర్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. వారికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శాలువతో సత్కరించారు. ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యత లు తీసుకున్నట్లు మున్సిపల్ రికార్డు లో వారు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన హయాంలో మహబూబ్ నగర్ కార్పొరేషన్ గా మారడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాలమూరు పట్టణ అభివృద్ధికి కొత్త పాలకవర్గం కృషి చేయాలని కోరారు. పట్టణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంతో నమ్మకం ఉంచి మున్సిపాలిటీ ఎన్నికల్లో పట్టం కట్టారని, ప్రజల ఆకాంక్ష మేరకు పట్టణ అభివృద్ధి చేయాలన్నారు. మొదటి కార్పొరేషన్ లో అభివృద్ధి చేసేందుకు అవకాశం కల్పించిన ప్రజలకు ఏ సమస్య వచ్చినా పాలకవర్గం వెంటనే స్పందించాలని సూచించారు. పార్టీలకు అతీతంగా కార్పొరేషన్ లోని 60 డివిజన్ల అభివృద్ధికి కంకణం కట్టుకోవాలన్నారు. ఎన్నికల వరకే రాజకీయం అని, తరువాత అన్ని పార్టీల కార్పొరేటర్లు పట్టణ అభివృద్ధి కోసం పాటుపడాలని ఎమ్మెల్యే అన్నారు. పట్టణంలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో గుర్తించి వెంటనే పరిష్కారం చేయాల్సిన బాధ్యత కార్పొరేటర్లదే అన్నారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇన్చార్జీ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్ పి. వెంకటేశ్, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్ర కుమార్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మత్ అలి, ఐఎన్టీయుసి రాములు యాదవ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**మహిళల సాధికారతే సమాజ అభివృద్ధి**

మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాబార్డ్ ఆర్థిక సహకారంతో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి గ్రామ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు స్వయంగా తయారు చేసిన పల్లె ఉత్పత్తులు, ఆహార పదార్థాలు, హస్తకళా వస్తువులకు మార్కెట్లో వేదిక కల్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందన్నారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడమే కాకుండా, సమాజంలో గౌరవ స్థానాన్ని సంపాదించుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మహిళా శక్తి -రాష్ట్ర శక్తి అనే నినాదంతో ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.



# విద్యాభివృద్ధి సమాజ పురోగతికి మూలం

- మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్

**ముద్ర, కాప్రా:**

విద్యాభివృద్దే సమాజ పురోగతికి మూలాధారం అని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. మల్లాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈటల రాజేందర్, బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి టెక్ నిప్ ఎఫ్ఎంసి సంస్థ స్పాన్సర్‌గా వ్యవహరించగా, హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ భాగస్వామిగా ఉంది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

- అదనపు కలెక్టర్ రాజేశ్వరి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

రబీ సీజన్ సంబంధించి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేటులోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీలో ధాన్య సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. జిల్లాలోని 129 ధాన్యం సేకరణ కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకై చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి ధాన్యం సేకరణ కేంద్రాల్లో తూనికల సామాగ్రి, టార్పాలిన్లు, సంచులతో పాటుగా తేమ యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించే విధంగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం, జిల్లా సహకార అధికారి నాగార్జున, జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అందుబాటులో టెలీమానస్ సేవలు

- జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ఉమా గౌరి

**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:**




పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టెలిమానస్ సేవలను అందుబాటులో ఉంచినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సి. ఉమా గౌరి తెలిపారు. పరీక్షల ఒత్తిడి, ఆందోళన, భయం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులు ఉచితంగా 14416 మరియు 18008914416 హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చేసి నిపుణులైన కౌన్సిలర్ల సలహాలు పొందవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి పరీక్షా కేంద్రంలో టెలిమానస్ పోస్టర్లు ప్రదర్శించబడుతున్నాయి. అవసరమైతే ప్రత్యక్ష మానసిక ఆరోగ్య సేవలకు రిఫర్ చేసే సదుపాయం కూడా కల్పించబడింది. పరీక్షల అనంతరం ఫలితాల సమయంలో కూడా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున టెలిమానస్ సేవలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ సేవలను వినియోగించుకోవాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆమె సూచించారు.

# సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అని తెలిపారు. శుక్రవారం వికారాబాద్ పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో వికారాబాద్ పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి 78, షాదిముబారక్ 31, ముఖ్యమంత్రి సహాయ నిధి 23 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీ నారాయణ, వార్డు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



# మహిళల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తా

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**ముద్ర, మల్కాజిగిరి:**



మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాల పాత్ర కీలకమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్లకు చెందిన ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించి, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు, నూతన రుణాల మంజూరు విధానం, బ్యాంకులతో సమన్వయం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాల పాత్ర కీలకమన్నారు. ఎస్ హెచ్ జి మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందేలా చూడాలని, బ్యాంకర్లతో సమన్వయం పెంచాలని, అవసరమైతే తానే మధ్యవర్తిత్వం చేసి సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని, మహిళ సాధికారత సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుధాకర్, మల్కాజ్గిరి-మౌలాలి-కీసర ప్రాజెక్ట్ ఆఫీసర్ నిరుపమ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు అల్వాల్ సర్కిల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# వేగ పరిమితులను అతిక్రమించకూడదు

- ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్

**ముద్ర, నారాయణపేట:**



వాహన చోదకులు వేగ పరిమితులను అతిక్రమించరాదని, అలాగే మైనర్లు వాహనాలు నడపవద్దని ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా నారాయణపేట జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెడికల్ కళాశాలలో విద్యార్థులకు డిఫెన్స్ డ్రైవింగ్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ సురక్షితమైన డ్రైవింగ్ వల్ల ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. భవిష్యత్ లో వైద్యులు కాబట్టి సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను కాపాడే బాధ్యత మీపై ఉంటుందని, అందుకే ముందుగా మీరు సురక్షితంగా ఉండటం అత్యవసరమని మెడికల్ విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. కుటుంబంలో ఒక వ్యక్తి లేదా కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం మొత్తం కుటుంబం మొత్తం రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. సీఐ శివశంకర్, కళాశాల ప్రిన్సిపల్ కే.సంపత్ కుమార్ సింగ్, ఎస్ఐలు రాముడు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

# వాహనదారుల్లో నిర్లక్ష్యం పనికిరాదు

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**



చిన్నపాటి నిర్లక్ష్యమే జీవితంలో పెద్ద విషాదాన్ని నింపుతుందని జిల్లా ఎస్పీ స్నేహ మిశ్రా అన్నారు. శుక్రవారం అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యభారతి హాల్‌లో ప్రత్యేక కంటి వైద్య శిబిరం, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్ల ప్రాణాలు మాత్రమే కాకుండా, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలు కూడా వారి చేతుల్లోనే ఉంటాయని అన్నారు. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఎదుటివారిని కూడా సురక్షితంగా ఉంచగలమన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, అదే సమయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముఖ్యంగా కంటి చూపు లోపాలు ఉన్న డ్రైవర్లకు రాత్రి వేళల్లో ప్రమాద ముప్పు ఎక్కువగా ఉంటుందని, డ్రైవర్లందరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఆటో, కార్, బస్సు, లారీ డ్రైవర్లు, విద్యార్థులు యువతతో కలిసి ఆమె రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిబిరంలో ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే కార్యక్రమంలో పాల్గొన్న మీడియా మిత్రులకు జిల్లా ఎస్పీ చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్, సబ్ డివిజన్ ఎస్.ఐలు, డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు అండగా ఉంటా

- ప్రొఫెసర్ కోదండరాం

**ముద్ర, మల్కాజిగిరి:**

తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కొత్త కార్యవర్గం శుక్రవారం ప్రొఫెసర్ కోదండరాంను మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో పలు ముఖ్య విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా రాష్ట్ర టీయూఎఫ్ అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన ఓరుగంటి ఆనంద్ ను ఆయన అభినందించి, శాలువాతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ మీడియా ఇన్చార్జ్ తాడూరి గగన్ కుమార్, రాష్ట్ర నాయకురాలు జానకి రెడ్డి, ఉపాధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్, కార్యనిర్వాహక కార్యదర్శి నరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ భేటీ తెలంగాణ ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపిందని నిర్వాహకులు తెలిపారు.

# నవంద్గీ రైల్వేస్టేషన్ లో హుబ్లీ ట్రైన్ నిలుపుదల

**ముద్ర, తాండూర్:**


ఎన్నో ఏళ్లుగా హైదరాబాద్ వెళ్లేందుకు నవంద్గీ స్టేషన్లో హుబ్లీ రైలు నిలుపుదల కోసం చేసిన ప్రయత్నం ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మూలంగా నెరవేరింది. వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గ పరిధిలోని బషీరాబాద్ మండలం నవంద్గీ రైల్వే స్టేషన్ లో తాండూర్ రైల్వేస్టేషన్కు 20 కిలోమీటర్ల దూరం ఉండడం వల్ల ఇక్కడ హుబ్లీ ట్రైన్ ఆపేవారు కాదు. ఎన్నో ఏళ్లుగా రైల్వే అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేడుకున్నారు. ఎట్టకేలకు శుక్రవారం ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. అందుకు కృషిచేసిన ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ని స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సహకరించిన ప్రధాని మోడీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు, స్థానిక నేతలతో కలిసి నవంద్గీ రైల్వే స్టేషన్ నుంచి తాండూర్ వరకు ట్రైన్ లో ప్రయాణించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 28-02-2026
www.mudranews.in | @mudranews



**టాప్ 10 మేధావులు**

**4. నికోలా టెస్లా**



ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో విప్లవాత్మక ఆవిష్కరణలు చేశాడు. ఏసీ కరెంట్ వ్యవస్థతో ఆధునిక విద్యుత్ ప్రపంచానికి పునాది వేశాడు.



### కవితపై పెట్టిన లిక్కర్ కేసును
# కోర్టు కొట్టివేయడం సంతోషకరం

<u>ముద్ర, కరీంనగర్:</u>

తెలంగాణ జాగృతి అధినేత్రి కవిత మీద పెట్టిన కేసును శుక్రవారం ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కేసును కొట్టివేయడం సంతోషకరమని జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ లో తెలంగాణ జాగృతి అధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్స్ పంపిణి చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవితపై పెట్టిన ఢిల్లీ లిక్కర్ కేసు అనేది తప్పుడు కేసు అని రౌస్ ఎవెన్యూ కోర్టు తేల్చి చెప్పికొట్టివేసిందని, సిబిఐ పెట్టిన లిక్కర్ కేసులో స్కాం లేదని కోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కావాలని రాజకీయంగా దెబ్బ కొట్టడం కోసమే ఇలాంటి తప్పుడు కేసులకు పాల్పడిందని, ఈ కేసులో కవితతో పాటు కేజ్రీవాల్, మనీష్ సిసోడియా తదితరులకు క్లీన్ చీట్ వచ్చిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, అధివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ నాయకులు వారల శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, పిన్నింటి సంగీత రెడ్డి, యండి సల్మ, పూదరి రజేశ్వరిగౌడ్, కుర్ర పోచాయ్య, గాలిపల్లి రాత్మకర్ చారి, యండి హుసైన్ జంగ అపర్ణ, బండ అశోక్, సంతోష్ యాదవ్, కుర్ర కౌసిక్, బసవేణి రాజేందర్, కొత్తురి రఘు, గుండెటి తిరుపతి పుసాల పవన్, యండి రజీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

<u>ముద్ర, ధర్మపురి:</u>



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా చింతామణి చెరువు గట్టుకు తీసుకువచ్చి వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్ట బంగారం సేకరణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురిలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరవుతున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, దేవాలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, కౌన్సిలర్లు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదాల నివారణ
# అరైవ్ అలైవ్ లక్ష్యం

**- ఎస్పీ జానకి షర్మిల**

<u>ముద్ర ప్రతినిధి, నిర్మల్:</u>




రోడ్డు ప్రమాదాలను నివారణే అరైవ్ అలైవ్ లక్ష్యమని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. రెండవ దశ అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముధోల్‌లో ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక ఆసుపత్రి వైద్యుల సహకారంతో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరంలో చూపు సమస్యలు ఉన్న డ్రైవర్లను గుర్తించి వారికి ఉచితంగా కళ్ళజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ డా.జి. జానకి షర్మిల మాట్లాడుతూ దూరదృష్టి లోపం, చూపు మందగించడం వంటి సమస్యలు రోడ్డు ప్రమాదాలకు ఒక ముఖ్య కారణమవుతున్నట్టు పేర్కొన్నారు. డ్రైవర్లు తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ముధోల్ ఇన్స్పెక్టర్ రవీందర్, సమ్మయ్య, ఎస్ఐలు, సిబ్బంది, డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

**- దాతలిచ్చిన హెల్మెట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

<u>ముద్ర, మహాదేవపూర్:</u>



వాహన దారులు హెల్మెట్ తప్పని సరి ధరించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శుక్రవారం గణపురం పోలీస్ స్టేషన్‌లో చక్రవర్తి హాస్పిటల్ వరంగల్, శ్రీకాంత్ మిత్ర బృందం, జర్నలిస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ల ఉచిత పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేయాలన్నారు. వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా విధి గా హెల్మెట్ ధరించాలని సూచించారు. సింగరేణి, ఎఎంఆర్, జెన్కో, మెగా తదితర సంస్థల ద్వారా మరిన్ని హెల్మెట్లు పంపిణీ చేయాలని కోరారు. చక్రవర్తి హాస్పిటల్ అధినేత డా తరుణ్ రెడ్డి 200 హెల్మెట్స్ ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ పలు సూచనలు చేశారు. జర్నలిస్టులు, ప్రైవేట్ వైద్యులు, శ్రీకాంత్ మిత్ర బృందంను అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీవో సందాని, డిపిఆర్ఓ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ కుమార్, సర్పంచ్, జర్నలిస్టులు, చక్రవర్తి హాస్పిటల్ వైద్యులు తరుణ్ రెడ్డి, శ్రీకాంత్ మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

**- కలెక్టర్ అభిలాష అభినవ్**

<u>ముద్ర ప్రతినిధి, నిర్మల్:</u>



ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందించేందుకు ప్రకృతి వ్యవసాయం దోహద పడుతుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కింద ఎంపిక చేసిన ఐకేపీ మహిళలకు శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్గానిక్ పంటల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నిర్మల్ జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేసేందుకు 15 క్లస్టర్లను ఎంపిక చేశామని, ప్రతి క్లస్టర్ నుండి ఇద్దరు ఐకేపీ మహిళలను 'కృషి సఖి'లుగా ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. వీరు గ్రామాల్లోని రైతులకు సేంద్రియ సాగు విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారని అన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 'కృషి సఖి' మహిళలకు కలెక్టర్ ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, అరణ్య సంస్థ ప్రతినిధులు పద్మ, నర్సయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

### పంట నష్టంపై సర్వేకు ఆదేశాలు

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల దెబ్బతిన్న పంటల నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జరిగిన ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా సుమారు 5,000 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ప్రతి పంట పొలాన్ని సందర్శించి, జరిగిన నష్టంపై సమగ్ర నివేదికను యుద్ధప్రతిపాదికన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా పేరు నిలపాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకాంక్షించారు. లక్ష్మణచాందా మండలం వడ్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. గణితం, ఇంగ్లీషు తదితర ముఖ్య విషయాలకు సంబంధించి పలు ప్రశ్నలు అడిగి, సమాధానాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట డీఈఓ భోజన్న, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ చిత్రా మిశ్రా

<u>ముద్ర, కరీంనగర్:</u>

కరీంనగర్ జిల్లా నూతన కలెక్టర్ గా చిత్రా మిశ్రా శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చిత్రా మిశ్రాను కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఏవో సుధాకర్ , పలువురు జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్టీల సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలి

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్**




<u>ముద్ర ప్రతినిధి, నిర్మల్:</u>

ఎస్టీ వర్గాల వారికి అన్ని సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీల) అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల తీరును పరిశీలించేందుకు ఆయన జిల్లాలో పర్యటించారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్మల్ లో నిర్వహించారు. ఎస్టీల సామాజిక, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని వారికి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యా, వైద్య సదుపాయాల లభ్యతపై అధి కారులను ఆరా తీశారు. ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో జాప్యం జరగకుండా చూడాలని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. ఐటీడీఏ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను నేరుగా గిరిజన గూడాలకు చేరవేయడంలో యంత్రాంగం చురుగ్గా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దీనిపై అభిలాష అభినవ్ జిల్లాలో గిరిజనుల సంక్షేమం కోసం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు. కమిషన్ సూచనల మేరకు గిరిజన ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి, పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

ఈ సమావేశంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్, జిల్లా అటవీ శాఖాధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, సాయికిరణ్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు హాజరయ్యారు.

## ప్రశాంతంగా మున్సిపల్ సమావేశం

**- తైబజార్ పన్ను రద్దు**

<u>ముద్ర ప్రతినిధి, నిర్మల్:</u>

నిర్మల్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ అప్పాల కావ్య గణేష్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ అప్పాల కావ్య మాట్లాడుతూ వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కాగా స్థానిక కూరగాయల మార్కెట్ లో గత కొన్నేళ్లుగా వసూలు చేస్తున్న తైబజార్ పన్ను వల్ల కూరగా యల విక్రేతలకు ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. తమ హయాంలో ఈ పన్నును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్ చక్రవర్తి, కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'వేతనాలపై విద్యా కమిషన్ వ్యాఖ్యలు విడ్డూరం'

<u>ముద్ర ప్రతినిధి, నిర్మల్:</u>

తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన "ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ–2026" రిపోర్టులో "టీచర్లకు జీతాలు ఎక్కువగా ఉన్నాయి" అనే అంశాన్ని చేర్చడం విడ్డూరమని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్టీయు) రాష్ట్ర అధ్యక్షుడు జి. సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ లు ఒక ప్రకటనలో ఖండించారు. ఈ వ్యాఖ్యలు ఉపాధ్యాయుల్లో మనోవేదన కలిగించడంతో పాటు, వారి వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఉపాధ్యాయుల సేవలపై తప్పుడు సంకేతాలు పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దేశంలో పలు రాష్ట్రాలతో పాటు, వివిధ దేశాలలో ఉపాధ్యాయుల వేతనాలు తెలంగాణ కంటే ఎక్కువ ఉన్నాయని గుర్తు చేశారు. విద్యా కమిషన్ తన పరిధి దాటి ఇలా ప్రస్తావించడం అసమంజసమని వారన్నారు. వేతన నిర్ణయం నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో "పే రివిజన్ కమిషన్" పరిధిలో ఉండే విషయమని పేర్కొన్నారు.

ప్రస్తుతం మూడేళ్ళుగా పి ఆర్సి, నాలుగు డి.ఎ.లు, పెండింగ్ బిల్లులు లేక ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఇలాంటి వ్యాఖ్యలు ఉపాధ్యాయ లోకంలో విస్మయానికి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల గౌరవం, మనోభావాలను కాపాడేలా ప్రభుత్వం ఇట్టి వ్యాఖ్యలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.




## ఘన్పూర్-హైదరాబాద్ బస్ సర్వీసు ప్రారంభం

<u>ముద్ర, మహాదేవపూర్:</u>

ఘన్పూర్ నుండి హైదరాబాద్ కు నూతన బస్ సర్వీస్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘనపురం బస్ స్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు హైదరాబాద్ నగరానికి రాకపోకలు సులభతరం చేయడం లక్ష్యంగా ఈ సర్వీసును ప్రారంభించామని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రవాణా సౌకర్యాలను విస్తరించడం జరుగుతుందని తెలిపారు.జిల్లా ఎస్పీ సంకీర్త్ ప్రయాణికులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. బస్ స్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం బస్టాండ్ నుండి పోలీస్ స్టేషన్ వరకు బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

<u>ముద్ర, మహదేవపూర్:</u>

ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది నిరంతరం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తుంటారని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని అన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్, బరువు, తదితర సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సిబ్బంది ప్రతి 6 నెలలకు ఒకసారి తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్పి సంకీర్త్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, టిజిఓ కార్యదర్శి సునీల్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ సంధాని, కార్యవర్గ సభ్యులు డా.మాధ్గుసూదన్, బాబూరావు, డా.కుమారస్వామి, ఫణి కుమార్, డా.వెంకన్న, సంతోష్, శ్రీనివాస రావు, రాధిక, స్వాతి టీజీఓ ప్రతినిధులు, టీఎన్జీవో అధ్యక్షులు బూరుగు రవి, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకరయ్య, వైద్య బృందం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

10వ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో 10వ తరగతి ఉత్తమ ఫలితాల సాధనపై విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రతిభను విశ్లేషించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో రోజువారీ పరీక్షలు, వారాంతం మోడల్ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకులు సమర్థవంతంగా సేవలందించాలి

<u>ముద్ర ప్రతినిధి, నిర్మల్:</u>

బ్యాంకులు తమ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కోరారు. వివిధ బ్యాంకుల త్రైమాసిక సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బ్యాంకుల ద్వారా రూ.8409.62 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. 64.56 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, ఆర్బీఐ ఎజిఎం రాములు, నాబార్డు డిడిఎం వీరభద్రుడు, బ్యాంకర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ను కలిసిన నూతన అదనపు కలెక్టర్

నిర్మల్ జిల్లాకు బదిలీపై వచ్చిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

28.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 మేధావులు**

**5. స్టీఫెన్ హాకింగ్**



బ్లాక్ హోల్స్, విశ్వ రహస్యాలపై లోతైన పరిశోధనలు చేశాడు. తన శారీరక పరిమితుల మధ్య కూడా విజ్ఞానానికి అద్భుతమైన సేవ చేశాడు.

## మంత్రిని కలిసిన కొత్త కలెక్టర్

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**



రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన అనురాగ్ జయంతి శుక్రవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా పేదలకు చేరేలా,అర్హులైన వారికి లబ్ది జరిగేలా పని చేయాలని ఈ సందర్భంగా సూచించారు. బృహత్తర బాధ్యతగా భావించి పేదల సంక్షేమం కోసం కృషి చేయాలని మంత్రి నూతన కలెక్టర్ అనురాగ్ జయంతికి సూచించారు.



## నిధులు విడుదల చేయాలి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

రాష్ట్ర ఇరిగేషన్ శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బస్వాపూర్ ప్రాజెక్ట్ తిమ్మపూర్ ఆర్ & ఆర్ ప్యాకేజ్ నిధులు విడుదల చెయ్యాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పంచించి త్వరలోనే నిధులు విడదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

## నేడు వెలుగుమట్లకు ఈటల

**ముద్ర, ఖమ్మం:**



వెలుగుమట్ల భూబాధితులకు భరోసా కల్పించేందుకు బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి లోకసభ సభ్యుడు ఈటల రాజేందర్ శనివారం ఉదయం 11 గంటలకు ఖమ్మం రానున్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఈటల రాజేందర్ బాధితులతో ముఖాముఖి సమావేశం అవుతారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను నేరుగా అడిగి తెలుసుకుంటారు. పార్టీ పక్షాన బాధితులకు అండగా ఉంటామని కొండంత ధైర్యాన్ని నింపనున్నారు. వారికి చట్టబద్ధంగా పూర్తి న్యాయం జరిగేలా అవసరమైన అన్ని వేదికలపైనా పోరాటానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేయనున్నారు. అడుగడుగునా బాధితులకు రక్షణ కవచంలా నిలబడతామని ప్రకటించనున్నారు. బాధితుల పక్షాన నిలబడి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోటేశ్వరరావు కోరారు.




## బీసీ సదస్సును విజయవంతం చేయాలి

**ముద్ర, ఖమ్మం:**

మార్చి 1న నిర్వహించనున్న బీసీ సదస్సు కు సంబంధించిన పోస్టర్ ను శుక్రవారం ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తొండపు వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. నిర్వహిస్తున్న సదస్సుకు ప్రొఫెసర్ కోదండరాం హాజరవుతున్నందున బీసీలతో పాటు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షులు షేక్ సర్దార్ హుస్సేన్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిపల్లి రవి, అడ్వకేట్స్ నునావత్ రవీందర్, జొన్న బోయిన గోవింద రావు, మల్సూర్, సుధాకర్, పమ్మి రవి, ఖమ్మం గర్జన, వేల్పుల రామయ్య పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో పారిశుద్ధ్య పనులను నూతన చైర్మన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య శుక్రవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోత్కూర్ ను ఆదర్శం మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని అన్నారు. డ్రైన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, గుడ్లపై ఉన్న చెత్తలను వెంటనే తొలగించాలని ఆమె అన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కార్మికులకు సూచించారు.



# ఇళ్లు కూల్చడమేనా ఇందిరమ్మ రాజ్యం

- భూ దాన్ అక్రమార్కుల నిగ్గు తేల్చాలి
- వామపక్ష పార్టీలు పేదల పక్షమే
- బాధితులకు న్యాయం చేయాలి
- తక్షణ సాయంగా లక్ష రూపాయలు ఇవ్వాలి
- విలేకర్ల సమావేశంలో వామపక్షపార్టీల నేతలు

**ముద్ర, ఖమ్మం:**



ఇందిరమ్మ రాజ్యం అంటే కూలీ పనులు చేసుకుంటూ గూడు ఏర్పరుచుకున్న నిరుపేదల ఇళ్లను కూల్చి వారిని మెడ పట్టి గెంటి వేయడమేనా అని పలువురు వామపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల కూల్చి వేత సందర్భంగా ఎటువంటి నోటిసులు లేకుండా వారి సామాన్లు కూడా తీసుకోనివ్వకుండా 2వేల మంది పోలీసులను, వందలాది మంది అధికారులను ఏర్పాటు చేసి తెల్లవారు జామునుంచే కూల్చి వేయడం గాజా పై ఇజ్రాయిల్ చేసిన దమన కాండను గుర్తు చేసిందన్నారు. ఖమ్మం నగరంలోని సిపిఐ (ఎం) ఖమ్మం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో గల భూదాన్ భూముల్లో గత 10 సంవత్సరాల క్రితం నుంచి నిరు పేదలు పట్టాలు పొంది 600మంది నివసిస్తు న్నారని తెలిపారు. ఇళ్లు కూల్చి వేయడం వల్ల వారు రోడ్డున పడ్డారని, విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలను కూడా రాయ లేదన్నారు. 2014 నుంచి బడా బాబుల భూములను క్రమ బద్ధీకరణ చేస్తున్న ప్రభుత్వం పేదల ఇళ్లను ఎందుకు క్రమ బద్దీ కరించడం లేదని ధ్వజమెత్తారు. మొత్తం 62 ఎకరాలలోని 32 ఎకరాలలో ఇళ్ళ ను కూల్చి రూ.250 కోట్ల ఆస్తిని స్వాదీనం చేసుకొన్నామని గొప్పలు చెప్పుకుంటున్న వారు మిగతా స్థలం ఏమైనదో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. నిరు పేదలు ఆక్రమణ దారులు కాదని, కూలీ పనులు చేసుకుని అప్పులు తెచ్చుకొని ఇళ్లు నిర్మించుకునే వారన్నారు. అటువంటి వారి ఇళ్లను కూల్చివేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడమని అధికారులు చెప్పడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల నిర్వాసితులై అల్లాడుతున్నవారికి తక్షణ సాయంగా లక్షరూపాయలు అందించాలని, ఇళ్లు కోల్పోయిన ప్రతీ ఒక్కరికీ అదే స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కమ్యూనిస్టుల చరిత్ర తెలుసుకోవాలి**

తెలంగాణ సాయుధ పోరాటం లాంటి, ముదిగొండ భూపోరాటం వంటి ఎన్నో పోరాటాల ద్వారా పేదలకు ఇళ్లు, స్థలాలు, భూములు సాధించినటువంటి కమ్యూనిస్టు పార్టీల చరిత్ర కొంతమంది పెయిడ్ బ్యాచ్ కు ఏం తెలుసని వామపక్ష నేతలు మండి పడ్డారు. వామ పక్షాల పోరాటాలు లేకుండా వాళ్ళు మరణించకుండా, దెబ్బలు తినకుండా, నిర్బంధింప పడకుండా ఖమ్మం నగరంలో నీ పేదలు నివసించే రామన గుట్ట, దానవాయిగూడెం, రామన్నపేట, అగ్రహారం, దంస లాపురం, వై ఎస్ ఆర్ కాలనీ వంటి కాలనీలు ఏర్పడ లేదని తెలిపారు. ఇందిరమ్మ పథకం కూడా తమ పోరాటాల వల్లనే వచ్చిందన్నారు. అటువంటి వామపక్ష పార్టీలపై కొంత మంది కారు కూతలు కూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఆయా పార్టీల రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు వై .విక్రం,మేకల శ్రీనివాస్, ఆవుల అశోక్, పాముల మోహన్, రాజు, జి.మస్తాన్, శంకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

**ముద్ర, మోత్కూర్:**



మండల పరిధిలోని పాటిమట్ల మూల మలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి సుమారు 8.00 గంటల సమయంలో మోత్కూరు నుంచి తిరుమలగిరి వైపు వెళ్తున్న కారు పాటిమట్ల గ్రామంలోని మూల మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురు వ్యక్తులు తీవ్ర గాయపడ్డారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మూల మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్లే తరచుగా ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

## తొలగించిన ఇళ్ల సర్వే

**ముద్ర, ఖమ్మం:**



ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామ భూదాన్ భూముల ఆక్రమణలో ఈ నెల 24న తొలగించిన ఇళ్లకు సంబంధించి, వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వేను వెంటనే చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించబడిన ఇళ్లకు సంబంధించిన వ్యక్తుల సామాజిక, ఆర్థిక సర్వే చేపట్టుటకు జిల్లాలోని 14 మంది తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్టు కలెక్టర్ అన్నారు. ఇట్టి సర్వే అత్యంత త్వరితగతిన పూర్తిచేయడానికి తహశీల్దార్లకు ఆదేశాలు జారీచేసినట్టు కలెక్టర్ తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన వారికి ప్రభుత్వాదేశానుసారం నివాస స్థల పట్టాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు చర్యలు చేపడతామన్నారు. తొలగింపబడిన ఇండ్లకు సంబంధించిన వ్యక్తులు, వారి వారి గ్రామాల్లో అందుబాటులో ఉండి, సర్వేకు సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు.

## పరీక్షా కెంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీ

**ముద్ర, మోత్కూర్:**



మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఏ భాస్కర్ రావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట స్థానిక తహశీల్దార్ పి జ్యోతి, మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపర్ ఇండెంట్ పి విజయలక్ష్మి, డిఓ కవిత, సిట్టింగ్ స్క్వాడ్ స్థానిక డిప్యూటీ తహసిల్దార్ ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## నడిగూడెం ఎంఈఓగా వనం సత్యనారాయణ

**ముద్ర, నడిగూడెం:**

నడిగూడెం మండల విద్యాధికారి వల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వనం సత్యనారాయణ మండల విద్యాధికారిగా పదోన్నతి పొంది శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు పనిచేసిన ఎంఈఓ భాజ ఉపేందర్, ఉపాధ్యాయులు నూతన ఎంఈఓ ను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి రామదాసు నాగరాజు, బాబు, సుబ్బారావు ఎం ఆర్ సి స్టాఫ్ నాగరాజు రాజశేఖర్ రామారావు గురుస్వామి గోవర్ధన్ అంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు

- భద్రాద్రి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు

**ముద్ర, భద్రాచలం:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల భాగంగా శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీష్ పేపర్-I పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా ముగిసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు. జనరల్ విభాగంలో 7,612 మంది, వృత్తి విద్య విభాగంలో 1,872 మంది కలిపి మొత్తం 9,484 మంది విద్యార్థులు ఉండగా, అందులో జనరల్ విభాగంలో 7,365 మంది, వృత్తి విద్య విభాగంలో 1,677 మంది కలిపి మొత్తం 9,042 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. జనరల్ విభాగంలో 247 మంది, వృత్తివిద్య విభాగంలో 195 మంది కలిపి మొత్తం 442 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.

# విద్యార్థులపై దాడి హేయమైన చర్య

- వీసీ తక్షణమే రాజీనామా చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**





దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన అమానుష దాడిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తా వద్ద ఎస్ఎఫ్ఐ భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సుందరయ్య భవనంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతోనే క్యాంపస్‌లలో ఏబీవీపీ గూండాలు స్వైరవిహారం చేస్తున్నారని మండిపడ్డారు. ముసుగులు ధరించి విద్యార్థినుల హాస్టళ్లలోకి చొరబడి, ఇనుప రాడ్లతో దాడి చేయడం పిరికిపంద చర్య అని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను హింసతో అణచివేయలేరని, విద్యార్థి లోకం ఈ దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థి నాయకుల బహిష్కరణ ఎత్తివేయాలి, విద్యార్థులు తమ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని వి.సి.ని వైఖరిని ప్రశ్నించినందుకు వారిని క్యాంపస్ నుండి బహిష్కరణ చేయడం దుర్మార్గపు చర్య తక్షణమే వారిపై బహిష్కరణ ఎత్తివేయాలి లేకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, ఈర్ల రాహుల్ , తిగుల్ల శ్రీనివాస్ , ధరావత్ జగన్ నాయక్, సహాయ కార్యదర్శులు ఇందు రాణి,పుట్టల ఉదయ్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 28.02.2026
www.mudranews.in | @mudranews



**టాప్ 10 మేధావులు**



గలిలియో గలిలీ దూరదర్శిని ద్వారా గ్రహాల పరిశీలన చేసి శాస్త్ర విప్లవానికి నాంది పలికారు. సైన్సు ఆధారిత ఆలోచనలకు బలమైన పునాది వేశారు.

# ఎస్సీ, ఎస్టీల కేసుల్లో అలసత్వం వద్దు

**- రాష్ట్ర కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**




**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ఎస్సీ, ఎస్టీల కేసుల్లో అలసత్వం వద్దని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు ఆదేశించారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్ లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై తప్పుడు కేసులు నమోదు చేయవద్దన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగితే అరికట్టాలని సూచించారు. నర్సాపూర్ లోని పెద్ద చింతకుంట గిరిజనులపై జరిగిన దాడి కేసు విచారణలో విచారణ అధికారిని మార్చాలని ఎస్పీని ఆదేశించారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవనానికి మార్చి 26 వరకు స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణం ప్రారంభించాలని ఆర్డీవోను ఆదేశించారు. హవేలి, ఘనపూర్ తదితర గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలను 45 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. నర్సాపూర్ మండలం మమతాబాద్ లోని గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి వసతులు, నాణ్యమైన భోజనంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు నివేదిక సమర్పించాలని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారం అందించడంలో నిర్లక్ష్యాన్ని విడనాడాలని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ బాధితులకు డబుల్ బెడ్ రూమ్ లను కేటాయించాలని ఆదేశించారు. హత్య, అత్యాచారం, సాంఘిక బహిష్కరణ తదితర కేసుల్లో బాధితులకు పక్క ఇండ్లను అందించాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆధ్వర్యంలో సైబరాబాద్, మల్కాజ్ గిరి, హైదరాబాద్ జిల్లాల్లో ఎస్సీ ,ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్ బెడ్ రూమ్ లపే పంపిణీ చేశామని తెలిపారు. వివిధ శాఖలు అమలు చేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు. మెదక్ పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్ నూతన దుకాణాల సముదాయాలను తక్షణమే నిర్మాణాలను ప్రారంభించాలని ఆదేశించారు. మెదక్ పట్టణంలో ఎస్సీలపైనే అట్రాసిటీ కేసు పెడతారా అని ప్రశ్నించారు. అందుకు డి ఎస్పీ ప్రసన్న కుమార్ వివరణ ఇచ్చారు. తుప్రాన్ డివిజన్ లో ఎక్కువ కేసులు నమోదు అయినా పోలీసు అధికారులు సరైన రీతిలో పట్టించుకోవడం లేదని డీబీఎఫ్ కార్యదర్శి శంకర్ ఆరోపించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, అడిషనల్ కలెక్టర్ నగేష్, ఎస్పీ శ్రీనివాసరావు, షెడ్యూలు కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి , గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ, ట్రైనీ అధికారి సింధు, దళిత సంఘాల నాయకులు, డీవీఎంసి సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్థికాభివృద్ధిలో విశ్వకర్మల పాత్ర కీలకం

**- ఎంపీ రఘునందన్ రావు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** దేశ ఆర్థికాభివృద్ధిలో విశ్వకర్మల పాత్ర కీలకమని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో నిర్వహిం చిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారుల అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతరించిపోతున్న కుల వృత్తులు, చేతివృత్తులను ప్రోత్సహించి విశ్వకర్మల ఆర్థికాభివృద్ధికి చేదోడు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. వారికి త్వరలోనే టూల్ కిట్లు అందిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విశ్వకర్మల ఆర్థకాభివృద్ధి సాధ్య మవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ గుల్షన్ సింగ్, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, విశ్వకర్మ పథకం లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు సాఫీగా జరగాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం నర్సాపూర్ లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో జరుగున్న పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

**మూడో రోజు ప్రశాంతం..**

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఇంగ్లీష్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. మొదటి సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగంలో 5,877 గాను 5,716 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 608 గాను 589 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో మూడో రోజు హాజరు శాతం 97.25 గా నమోదైనట్లు జిల్లా అధికారి మాధవి తెలిపారు

## మంత్రిని కలిసిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమా సింగ్ శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి మంత్రి దామోదర్ రాజ నర్సింహాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెదక్ జిల్లాను అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ముందంజలో ఉండాలని కలెక్టర్ కు ప్రతిమా సింగ్ కు సూచించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను తప్పకుండా నెరవేర్చుతానని తెలిపారు.

## కలెక్టర్ ను కలిసిన టీఎన్జీవోలు



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రతిమాసింగ్ ను శుక్రవారం టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు పజాలుద్దీన్, రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, కిరణ్ కుమార్, రాధా, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు సతీష్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, చంద్రహాస్, సహ అధ్యక్షుడు శ్రీకాంత్, స్వాతి పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**
దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ సూచించారు. శుక్రవారం కళాశాలలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో ఎన్ ఎస్ ఎస్, మేరా యువ భారత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్ల మెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధిలో వెంకటాపూర్ ఆదర్శం

**- ఎమ్మెల్యే హరీశ్ రావు**



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**
అభివృద్ధిలో సిద్దిపేట నియోజకవర్గానికే వెంకటాపూర్ గ్రామం ఎంతో ఆదర్శంగా నిలిచిందని స్థానిక ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. నంగునూరు మండలం వెంకటాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత మంచి దేవాలయం నిర్మించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గతంలో ఈ దేవాలయానికి తాను కూడా లక్ష రూపాయలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అక్క చెల్లెళ్ల కోరిక మేరకు ద్వితీయ వార్షికోత్సవం వరకు ఆంజనేయస్వామికి కిరీటం చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. వెంకటాపూర్ లాగే మంచి పంటలు పండించి ఆర్థికంగా ఎదుగాలని ఏ ఊరికి వెళ్లినా చెబుతుంటానని గుర్తు చేశారు. ప్రజలు బాగుండాలని ఆంజనేయ స్వామి వారిని వేడుకున్నట్లు చెప్పారు. గతంలో వెంకటాపూర్ లో కొన్ని భూములు మురంబాద్ పేరు మీద ఉండేవన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతుబంధు ప్రారంభ దశలో సుమారు ఐదు వందల ఎకరాలకు పెట్టుబడి సాయం అందలేదని గుర్తు చేశారు. మురంబాద్ అనే గ్రామం పేరు ఎక్కడా కూడా ఆన్ లైన్ కాలేదని, రైతులకు పాస్ బుక్కులు కూడా లేకపోవడంతో రైతు బంధుకు ఆటంకం ఏర్పడిందని తెలిపారు. ఆ సమయంలో తాను ఏడాది కష్టపడి ఆ భూములన్నీ ఆన్ లైన్ చేయించి రైతు బంధు అందేలా కృషి చేశానని చెప్పారు.

# భూ భారతితో రైతుల భూములకు రక్షణ



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**
ప్రజా ప్రభుత్వంలో అమలవుతున్న భూభారతితోనే రైతులు తమ భూములకు రక్షణ ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ఎమ్మెల్యే హరీష్ రావు కు రెవెన్యూ వ్యవస్థ గుర్తు రాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెవెన్యూ వ్యవస్థ ఉన్నట్లు గుర్తించారా అని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ హయాంలో రెవెన్యూ కార్యాలయాల్లో తనిఖీలు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెడితేనే ధరణి అక్రమాలు బయటపడ్డాయన్నారు. ధరణి పేరుతో పది సంవత్సరాలు మీ ప్రభుత్వంలో చెప్పలేనన్ని అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణి అక్రమాలను సరిచేసి భూభారతిగా అమలు చేస్తున్నామన్నారు. భూ భారతి పథకం అమలు కావడంతో రైతులు ఆనందంలో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే బీఆర్ఎస్ నాయకులకు మింగుడు పడటం లేదని విమర్శించారు. రాజకీయంగా లబ్ధి పొందడానికే ప్రతిరోజు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. సాదా బైనామా దరఖాస్తులు మీ ప్రభుత్వ హయాంలోనే పెండింగ్ లో ఉన్నాయన్నారు. పైగా తమ ప్రభుత్వంలోనే పెండింగ్ లో పెట్టినట్టు అబద్ధాలు మాట్లాడటం తగదన్నారు. సిద్ధిపేటలో 1340, 1668 సర్వే నంబర్లలో బీఆర్ఎస్ నాయకులు కొండం సంపత్ రెడ్డి, రాజనర్సులు కబ్జా చేయాలేదా అని ప్రశ్నించారు. సిద్దిపేటలో కబ్జా అయిన భూములపై విచారణకు ఆదేశించాలని సవాల్ చేశారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గ్యాదారి మధు, గయాజుద్దీన్, హర్ష హుస్సేన్, విజయ డానియల్. నజ్జు బాబా, రాజిరెడ్డి, సంతోష్ గౌడ్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

**- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ హామీ ఇచ్చారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్ లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జలగం ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. అధికారుల వేధింపులు, పదోన్నతులలో అక్రమాలు జరిగాయంటూ తమ దృష్టికి వచ్చిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ త్వరలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. క్లాస్ ఫోర్త్ భవనం, ఉద్యోగుల ఇళ్ల స్థలాల కోసం కూడా తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

అనంతరం జిల్లా కార్యదర్శి మినీకే రాజ్ కుమార్ తో కలిసి నాలుగో తరగతి ఉద్యోగులు రూపొం దించిన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రిజ్వాన్ అలీ, సహాధ్యక్షులు పోచయ్య, కార్యవర్గ సభ్యులు ప్రసన్న, స్వప్న, ఝాన్సీ, ప్రతాప్, హైమద్, శకుంతల, టీఎన్జీవో నాయకులు అనురాధ, ఇక్బాల్ పాషా, పజాలుద్దీన్, రఘునాథ రావు, లీల, శివాజీ, కిరణ్, రాధా, విష్ణువర్ధన్ రెడ్డి, సతీష్, సంతోష్, శ్రీకాంత్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

## తాగునీటి కొరత లేకుండా చూడాలి

**- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య**




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:** జిల్లాలో వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఎన్ఆర్ఈజీఎస్ పనులు, గ్రామీణ తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులు, ఎంపీడీవోలతో మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ప్రతి గ్రామంలో ముందస్తు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏ మండలంలోనూ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడవద్దని స్పష్టం చేశారు. బోరు బావులు ఫ్లషింగ్, మోటార్ల రిపేర్, పైపుల లీకేజీ రిపేర్లు తదితర పనులకు గ్రామపంచాయతీ నిధులు వినియోగించాలని సూచించారు. తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. నీటి సమస్యలు పునరావృతమవుతున్న గ్రామాలను ఎంపీడీవోలు స్వయంగా సందర్శించి ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మెటీరియల్ కంపోనెంట్‌కు అనుగుణంగా గ్రామ పంచాయతీల్లో లేబర్ వినియోగం పెరగాలని ఎంపీడీవోలకు సూచించారు. జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, డీఆర్డీఓ జ్యోతి, హౌసింగ్ పీడీ చలపతిరావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ రఘువీర్, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు, హౌసింగ్ ఏఈలు, ఎంపీఓలు, ఏపీవోలు పాల్గొన్నారు.

## సౌందర్ రాజన్ మృతిపై మంత్రి సంతాపం

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు, విద్యావేత్త డాక్టర్ సౌందర్ రాజన్ మృతిపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంతాపం తెలిపారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్‌గా, రిజిస్ట్రార్‌గా విద్యా రంగానికి సేవలందించిన అనంతరం చిలుకూరు క్షేత్ర విశిష్టతను నలుదిశలా వ్యాపింపజేయడంలో సౌందర రాజన్ కీలక పాత్ర పోషించారని మంత్రి కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 మేధావులు
7. మేరీ క్యూరీ
రేడియో యాక్టివిటీపై పరిశోధన చేసి రెండు నోబెల్ బహుమతులు అందుకుంది. మహిళల శాస్త్ర రంగంలో ముందడుగు వేయడానికి ప్రేరణగా నిలిచింది.



# ఆకాశంలో అద్భుతం.. ఒకే వరుసలో ఆరు గ్రహాలు!

- గ్రహాల పరేడ్ రేపే..
- అరుదైన ఖగోళ దృశ్యం మిస్ కావొద్దు
- సూర్యాస్తమయం తర్వాత విశేషం..



**ముద్ర న్యూస్ :**

ఆకాశంలో అప్పుడప్పుడు కనిపించే అద్భుతాల్లో "గ్రహాల పరేడ్" ఒక ప్రత్యేకమైన ఖగోళ సంఘటన. మన సౌర వ్యవస్థలోని గ్రహాలు ఒకే వరుసలో కనిపించడం చాలా అరుదు. రేపు జరగబోయే ఈ ఆరు గ్రహాల పరేడ్ ఖగోళ ప్రియులకు, సాధారణ ప్రజలకు కూడా ఒక అరుదైన దర్శనాన్ని అందించబోతోంది.సౌర వ్యవస్థలో సూర్యుడి చుట్టూ తిరిగే ప్రధానంగా 8 గ్రహాలు ఉన్నాయి. ఇవి తమ తమ కక్ష్యల్లో తమకు తగిన వేగంతో తిరుగుతుంటాయి. బుధుడు సూర్యుడికి అత్యంత సమీపంగా ఉండి కేవలం 88 రోజుల్లో ఒకసారి తిరుగుతాడు. శుక్రుడు 225 రోజులు, భూమి 365 రోజులు, అంగారకుడు 687 రోజులు తీసుకుంటాయి. ఇక గ్యాస్ జెయింట్స్ అయిన బృహస్పతి 12 సంవత్సరాలు, శని 29.5 సంవత్సరాలు, యురేనస్ 84 సంవత్సరాలు, నెప్ట్యూన్ 165 సంవత్సరాలు తీసుకుంటాయి. ఈ విభిన్న కాలాలు, దూరాలు కారణంగా గ్రహాలు ఒకే లైన్‌లో కనిపించడం చాలా అరుదుగా జరుగుతుంది.గ్రహాలు పూర్తిగా ఒకే సూటి గీతలో నిలబడటం వాస్తవంగా జరగదు. కానీ భూమి నుంచి చూసినప్పుడు అవి ఒకే దిశలో, ఒకే వరుసలో ఉన్నట్లు కనిపిస్తాయి. ఈ పరిస్థితినే "సిజిగీ" అంటారు. సాధారణంగా రెండు లేదా మూడు గ్రహాలు ఒకే లైన్‌లో కనిపించడం సాధారణమే. కానీ ఐదు లేదా అంతకంటే ఎక్కువ గ్రహాలు ఒకేసారి వరుసలో కనిపించడం మాత్రం చాలా అరుదైన సంఘటన.ఈసారి జరగబోయే గ్రహాల పరేడ్‌లో బుధుడు, శుక్రుడు, బృహస్పతి, శని, యురేనస్, నెప్ట్యూన్ అనే ఆరు గ్రహాలు ఒకే దిశలో కనిపించనున్నాయి. వీటిలో బుధుడు, శుక్రుడు, బృహస్పతి, శని గ్రహాలను మన కళ్లతోనే చూడవచ్చు. ఇవి ఎక్కువ ప్రకాశంతో కనిపిస్తాయి కాబట్టి నగరాల్లో కూడా స్పష్టంగా గుర్తించవచ్చు. ముఖ్యంగా శుక్రుడు అత్యంత ప్రకాశవంతంగా మెరుస్తాడు. బృహస్పతి కూడా ఒక పెద్ద తెల్లటి బిందువులా కనిపిస్తుంది. శని కొంచెం మందమైన కాంతితో కనిపిస్తాడు.

అయితే యురేనస్, నెప్ట్యూన్ గ్రహాలను మన కళ్లతో చూడటం కష్టం. ఇవి చాలా దూరంగా ఉండటంతో వీటి కాంతి చాలా మందగిస్తుంది. కాబట్టి వీటిని వీక్షించాలంటే బైనాక్యులర్లు లేదా టెలిస్కోప్ అవసరం. ఖగోళ శాస్త్రంపై ఆసక్తి ఉన్నవారు ఈ రెండు గ్రహాలను కూడా చూడడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవచ్చు.ఈ గ్రహాల పరేడ్‌ను వీక్షించడానికి సరైన సమయం సూర్యాస్తమయం తర్వాత కొద్ది సమయం. పశ్చిమ దిశగా ఆకాశాన్ని పరిశీలిస్తే ఈ గ్రహాలు వరుసగా కనిపిస్తాయి. నగరాల్లో లైట్ పొల్యూషన్ తక్కువగా ఉన్న ప్రదేశాలకు వెళితే మరింత స్పష్టంగా వీక్షించవచ్చు. అలాగే మేఘాలు లేకుండా ఆకాశం స్పష్టంగా ఉండటం కూడా ముఖ్యం.ఈ సంఘటన శాస్త్రీయంగా చాలా ముఖ్యమైనదే కాకుండా ప్రజల్లో ఖగోళంపై ఆసక్తిని పెంచుతుంది. ఇలాంటి అరుదైన సందర్భాలు విద్యార్థులకు, ఖగోళ శాస్త్రాన్ని నేర్చుకునే వారికి ఒక మంచి అవకాశం. ప్రకృతిలోని విశాలత, విశ్వంలోని అద్భుతాలను ప్రత్యక్షంగా చూడటానికి ఇది ఒక అరుదైన అవకాశం. మొత్తానికి రేపు కనిపించబోయే ఈ ఆరు గ్రహాల పరేడ్ ఒక అద్భుతమైన ఖగోళ క్షణం. మనం ఆకాశాన్ని కాస్త శ్రద్ధగా గమనిస్తే విశ్వం ఎంత అద్భుతంగా పనిచేస్తుందో మనకు తెలుస్తుంది. కాబట్టి ఈ అరుదైన దృశ్యాన్ని మిస్ కాకుండా తప్పకుండా వీక్షించండి.

## ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియ చేపట్టాలి

- -బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ యుగంధర్ గౌడ్

**ముద్ర, హైదరాబాద్:**

ఎనిమిదేళ్లుగా ఎక్సైజ్ శాఖలో పెండింగ్ లో ఉన్న కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాదులోని తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియాతో మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖలో మరుగున పడిన బదిలీల అంశంపై బీసీ పొలిటికల్ జేఏసీ పోరాటం చేస్తోందని, అందులో భాగంగానే గతంలో ముఖ్యమంత్రి, మంత్రి, సీఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు బదిలీలకు నోచుకోవడం లేదని, కొంతమంది అధికారులకు ప్రమోషన్ ఇచ్చినప్పటికీ నేటికీ పోస్టింగ్ మాత్రం ఇవ్వలేదన్నారు. బదిలీల అంశాన్ని కొంతమంది అధికారుల తీరు వల్ల ఆపడం జరిగిందని, ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేసి బదిలీలు చేయడమే కాకుండా ప్రమోషన్ ఇచ్చిన అధికారులకు పోస్టింగ్స్ వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒకే చోట ఎనిమిదేళ్లు పనిచేసిన కానిస్టేబుళ్ల ఇబ్బందులు ఉన్నతస్థాయి అధికారులకు గాని, ప్రభుత్వానికి కానీ కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. ఈ అంశంపై అనేకసార్లు బీసీ పొలిటికల్ జేఏసీ ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన సీఎస్ మరో వారం రోజుల్లో బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రెండు మూడు పోస్టింగ్లు ఒకే అధికారి నిర్వర్తిస్తుండడం వల్ల పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రజలకు, ప్రభుత్వానికి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టి ఎక్సైజ్ శాఖలో బదిలీల ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు గోటూరి రవీందర్ గౌడ్, యశ్వంత్, రేనట్ల మల్లేశ్, వినోద్ సాగర్, శ్రీధర్, రాకేశ, తదితరులు పాల్గొన్నారు.



# కేజ్రీవాల్, కవితలకు కోర్టు క్లీన్ చిట్

- లిక్కర్ స్కాంలో పెను సంచలనం

**ముద్ర న్యూస్ :**





దేశవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, తెలంగాణ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మంది నిందితులపై ఉన్న ఆరోపణలను కోర్టు కొట్టివేసింది. సరైన సాక్ష్యాధారాలు లేవని స్పష్టం చేస్తూ వారందరికీ విముక్తి కల్పించింది. ఈ తీర్పుతో దేశ రాజకీయాల్లో భారీ చర్చ మొదలైంది. ఒకవైపు అధికార యంత్రాంగంపై ప్రశ్నలు లేవనెత్తుతుండగా, మరోవైపు ప్రతిపక్షాలు దీన్ని తమపై జరిగిన రాజకీయ వేధింపులుగా పేర్కొంటున్నాయి. ముఖ్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ , బీఆర్ఎస్ శ్రేణుల్లో సంబురాలు వెల్లివిరిశాయి.

**కోర్టు వ్యాఖ్యలు.. సీబీఐపై తీవ్ర ఆక్షేపణలు**

ఈ కేసును విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి జితేంద్ర సింగ్ దర్యాప్తు సంస్థల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "కేవలం ఊహాగానాలు, అపూర్వర్ల వాంగ్మూలాల ఆధారంగా నిందితులను కుట్రదారులుగా చూపించడం సరైంది కాదు" అని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తులను సరైన ఆధారాలు లేకుండా ఆరోపించడం న్యాయపరంగా తగదని వ్యాఖ్యానించారు. "నిందితులు నేరం చేశారనడానికి ప్రాథమికంగా బలమైన సాక్ష్యాధారాలు లేవు. దర్యాప్తు పూర్తిగా లోపభూయిష్టంగా సాగింది" అని కోర్టు పేర్కొంది. సీబీఐ అధికారుల పనితీరుపై కూడా విచారణ జరపాల్సిన అవసరం ఉందని సూచించడం మరింత సంచలనంగా మారింది.

**- కేసు నేపథ్యం**

2021 నవంబర్‌లో ఢిల్లీ ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలసీని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఈ పాలసీ అమలులో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. 2022లో ఆ పాలసీని ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అనంతరం సీబీఐ, ఈడీ సంస్థలు విచారణ చేపట్టాయి. లైసెన్స్‌ల మంజూరులో అవినీతి జరిగిందని, ప్రతిఫలంగా పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నారని దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఈ కేసులో భాగంగా 2023లో మనీష్ సిసోడియాను, 2024లో అరవింద్ కేజ్రీవాల్, కల్వకుంట్ల కవితలను అరెస్ట్ చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

**- రాజకీయ ప్రభావం**

ఈ కేసు మొదటి నుంచి రాజకీయ రంగు పులుముకుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేస్తున్నాయనే విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పుడు కోర్టు తీర్పుతో ఆ విమర్శలకు బలం చేకూరిందని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి. ఆప్, బీఆర్ఎస్ నేతలు దీన్ని "న్యాయం గెలిచిన రోజు"గా అభివర్ణిస్తున్నారు. మరోవైపు అధికార పక్షాలు మాత్రం "చట్టపరమైన ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు" అని చెబుతున్నాయి. ఎందుకంటే సీబీఐ ఇప్పటికే ఈ తీర్పుపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది.

**- కేజ్రీవాల్ భావోద్వేగ స్పందన**

తీర్పు వెలువడిన అనంతరం అరవింద్ కేజ్రీవాల్ భావోద్వేగానికి గురయ్యారు. "నేను అవినీతి పరుడిని కాదు. నా జీవితంలో సంపాదించినది నిజాయితీ మాత్రమే" అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సంబురాలు చేసుకున్నారు. పార్టీ కార్యకర్తలు భారీగా మిఠాయిలు పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.

**- ముందున్న పరిణామాలు**

ఈ తీర్పు రాజకీయంగా, న్యాయపరంగా కీలక ప్రభావం చూపే అవకాశముంది. ఒకవైపు దర్యాప్తు సంస్థల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తుతుండగా.. మరోవైపు కేసులను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుతున్నారనే వాదనలు బలపడుతున్నాయి. అయితే సీబీఐ హైకోర్టును ఆశ్రయించనున్న నేపథ్యంలో ఈ కేసు పూర్తిగా ముగిసిందని చెప్పలేము. మొత్తం మీద ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో వచ్చిన ఈ తీర్పు దేశ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెరలేపింది. ఇది కేవలం ఒక కేసు తీర్పు మాత్రమే కాకుండా దర్యాప్తు వ్యవస్థల పనితీరు, రాజకీయాలపై వాటి ప్రభావంపై పెద్ద ప్రశ్నను ముందుకు తీసుకొచ్చింది.

# శేరిలింగంపల్లి కాంగ్రెస్ లో వర్గపోరు

- అరికపూడి - జగదీశ్వర్ గౌడ్ వర్గాల మధ్య కోల్డ్ వార్
- పార్టీ భవిష్యత్ అగమ్యగోచరం

**ముద్ర, శేరిలింగంపల్లి:**




తెలంగాణ రాష్ట్రంలో ప్రాధాన్యత కలిగిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి ఒకటి. రాజకీయ చైతన్యంతో పాటు ఆర్థిక వనరులకు కొదవ లేదు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకూ ఆశ్రయం కల్పించే ఈ నియోజకవర్గంలో భిన్న సంస్కృతులు గల ప్రజలు అధిక సంఖ్యలో ఉంటారు. ఈ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రధాన నేతలు స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికపూడి గాంధీ, పీసీసీ ప్రధాన కార్యదర్శి వాలిదాస్ జగదీశ్వర్ గౌడ్ మధ్య సమన్వయం కొరవడిందనే ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీని, పాలనను సమన్వయంతో నడపలేకపోతున్నారని, ఆ ఇద్దరు నేతలు తమ తమ వర్గాలను మాత్రమే కాపాడుకుంటూ ఎవరికి వారే రాజకీయాలు నెరుపుతున్నట్లు పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. అధికార పార్టీ నాయకులైన వీరు నియోజకవర్గంలో ప్రతి పక్షాలుగా వ్యవహరిస్తున్నారనే భావన కలిగిస్తున్నారని పార్టీ సీనియర్ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన అరికెపూడి గాంధీ కాంగ్రెస్ లోకి మారడం, కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన జగదీశ్వర్ గౌడ్ మధ్య సయోధ్య లేకుండా పోయింది. ఇటీవల నానక్ రాంగూడలో ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అరికెపూడి గాంధీ డౌన్‌డౌన్, గాంధీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేయడం, అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేసింది జగదీశ్వర్ గౌడ్ అనుచరులని గాంధీ వర్గం భావిస్తోంది.

**ఫ్లెక్సీల రగడ..**

ప్రభుత్వం, పార్టీకి చెందిన కార్యక్రమాల సందర్భంగా ఏర్పాటు చేసే ఫ్లెక్సీల్లో గాంధీ అనుచరులు జగదీశ్వర్ గౌడ్ ఫొటో, జగదీశ్వర్ గౌడ్ అనుచరులు గాంధీ ఫొటో వేయకపోవడం కూడా కారణమని చెబుతున్నారు. ఇటీవల నియోజకవర్గంలో జరిగిన ఓ కార్యక్రమానికి సంబంధించి జగదీశ్వర్ గౌడ్ అనుచరులు వేయించిన ఫ్లెక్సీల్లో అరికపూడి గాంధీ ఫొటో లేకపోవడం కూడా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దృష్టికి వచ్చినట్లు తెలిసింది. నియోజకవర్గంలో జరిగే ఒకటి రెండు కార్యక్రమాలు మినహా ఇద్దరూ కలిసి పాల్గొన్న కార్యక్రమాలు ఈ రెండేళ్లలో లేవనే చెప్పాలి. కాంగ్రెస్ పార్టీ జాతీయ నేతల కార్యక్రమాలు సైతం ఎవరికి వారే నిర్వహిస్తుంటారు. ఇక నియోజకవర్గంలోని అధికారులతో పనిచేయించుకోవడంలో అరికపూడిదే పైచేయిగా ఉందని జగదీశ్వర్ గౌడ్ అనుచరులు గుర్రుగా ఉన్నారు. అధికార పార్టీ నుంచి పోటీ చేసిన వ్యక్తిగా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా అధికారుల వద్ద సరైన ప్రాధాన్యత తనకూ, తన అనుచరులకు లభించడం లేదని సన్నిహితుల వద్ద జగదీశ్వర్ గౌడ్ వాపోయినట్టు తెలిసింది. ఇక పార్టీ పదవులు, సీట్ల కేటాయింపులలో ఎవరి వర్గానికి వారే లెక్కలు వేసుకుంటున్నారు. ఏళ్ల తరబడిగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తే అధికారం వచ్చాక అనుభవించలేకపోతున్నామని నికార్సైన కాంగ్రెస్ అభిమానులు మదనపడమే కాకుండా, వలస పక్షులు అందలం ఎక్కుతున్నారని చర్చ జరుగుతోంది. ఈ కలహాల కాపురంతో త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ శేరిలింగంపల్లి నియోజవకవర్గ పరిధిలో ఎలా ఉండబోతొందోనని చర్చ మొదలైంది.

**అనాథగా మారిన బీఆర్ఎస్..**

అరికపూడి గాంధీ కాంగ్రెస్ లో చేరడం, భారాసా నియోజకవర్గ భాధ్యతలు సమీపంలోని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావుకు అప్పగించడంతో శేరిలింగంపల్లిలో ఆ పార్టీ అనాథగా మారింది. అలాగే 2023 ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచిన బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి రవికుమార్ యాదవ్ అడపా దడపా కార్యక్రమాలు చేపడుతూ తన పార్టీ కార్యకర్తలకు టచ్ లో ఉంటున్నారు.

**ముఖ్యమంత్రి దృష్టి..**

ఈ నియోజకవర్గంపై ప్రత్యేకంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టిసారించినట్లు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య సయోధ్యకు ప్రయత్నాలు చేస్తున్నట్లు కనబడుతోంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పక్షాన పోటీ చేసి 72,968 ఓట్లు (43.69 శాతం) పొంది విజయం సాధించిన గాంధీ, 32.53 శాతం ఓట్లతో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడి, రెండవ స్థానంలో నిలిచిన జగదీశ్వర్ గౌడ్ కలిసి పనిచేస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి తిరుగుండదని పార్టీ అభిమానుల ఆశ. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ను కాంగ్రెస్ 'హస్త'గతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి పనిచేస్తారా, లేక అంతర్గత కలహాలతో ప్రతిపక్ష పార్టీలకు ప్రాణం పోస్తారా వేచి చూడాలి.

# రైతులకు కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం హక్కులు కల్పించండి

- రైతు కమిషన్ చైర్మన్, సభ్యులకు కవిత విజ్ఞప్తి
- రైతుకు మేలు చేసే చట్టం అమలు చేయండి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్రంలో 60 రకాల విత్తనాలను పండిస్తూ తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేసేందుకు అహర్నిషలు కృషి చేస్తున్న రైతులకు 2007లో పాసైన కాంట్రాక్ట్ ఫార్మింగ్ చట్టం ప్రకారం ఉండాల్సిన హక్కులు ఉండటం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు మేలు చేసే విధంగా ఆ చట్టాన్ని వాడకోవటం లేదన్నారు. ముఖ్యంగా సీడ్ పత్తి రైతులకు ఇచ్చే అడ్వాన్స్‌ను కూడా ఇంటరెస్ట్ తీసుకుంటూ భూములు రాయించుకుంటున్నారని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, వ్యవసాయాధికారులు రైతుల పక్షాన నిలవటం లేదన్న కవిత... చట్టంలో ఉన్న లోటుపాట్లను సరిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. శుక్రవారం తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యులను కలిసిన ఆమె రాష్ట్రంలో విత్తన పంటలు సాగు చేస్తున్న రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ కు వినతి పత్రం అందజేసి అక్కడ మీడియాతో మాట్లాడారు. చాలా మంది సీడ్ పండిస్తున్న రైతులు మన రాష్ట్రంలో ఉన్నందున మంచి సీడ్ చట్టం రావాల్సి ఉందన్నారు. రైతు కమిషన్ చైర్మన్‌గా సీడ్ పండించే రైతులకు మంచి జరిగేలా చూడాలని కోదండరెడ్డిని కోరారు. కరీంనగర్‌లో వరి సీడ్ పండిస్తున్న రైతులకు ఎకరానికి 75 వేలు ఇస్తున్నారనీ కానీ గద్వాల్‌లో సీడ్ పత్తి పండించే రైతులకు అడ్వాన్స్, ఫెస్టిసైడ్స్‌కు ఇచ్చే డబ్బులకు కూడా భూమి తనఖా పెట్టించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా 250 గ్రాముల తరుగు కూడా తీస్తున్నారని ఆరోపించారు.

**రూ.200 కోట్లు రావాల్సి ఉంది..**


కరీంనగర్‌లో వరి సీడ్ పండించే రైతులకు ప్రొక్యూర్ చేసిన తర్వాత మిగిలిన వాటిని కమర్షియల్‌గా అమ్ముకునే స్వేచ్ఛ ఉందని కవిత కమిషన్ కు వివరించారు. కానీ గద్వాల్‌లో సీడ్ పత్తి రైతులను మల్టీ లెవల్‌లో మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీడ్ పత్తి ఆర్గనైజర్స్, మీడియేటర్లు రైతులను పట్టి పీడిస్తున్నారన్నారు. ఎకరానికి ఎంత ఇస్తారో చెప్పిన తర్వాత పంట వచ్చినా రాకపోయిన రైతులకు డబ్బులు ఇవ్వాల్సి ఉందన్నారు. పంట రాకపోతే రైతులు పడే మానసిక ఆందోళనను కూడా పట్టించుకోవాలని చట్టంలో ఉందని వివరించారు. కానీ కంపెనీలు, ఆర్గనైజర్లు పట్టించుకోవటం లేదన్నారు. గద్వాల్ జిల్లాలో పరిస్థితిని తాము ప్రత్యక్షంగా చూశామన్నారు. కరీంనగర్‌లో వరికి ఎకరానికి 75 వేలు ఇచ్చినట్లే, గద్వాల్‌లో రైతులకు కూడా ఇప్పించాలని కమిషన్ ను కోరారు. సీడ్ ఇచ్చిన తర్వాత అది ఫెయిల్ అయితే దానికి రైతుకు సంబంధం ఉండకూడదన్నారు. కంపెనీ వాళ్లు ఇచ్చే సీడ్ ఫెయిల్ అయితే దానికి కంపెనీయే బాధ్యత వహించాలన్నారు. కానీ మీరు సరిగా నాటలేదంటూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. గద్వాల్ జిల్లాలో 10 వేల మంది సీడ్ పత్తి రైతులకు రూ. 2 వందల కోట్లు రావాల్సి ఉందన్న కవిత... మీరు జోక్యం చేసుకోని రైతులకు మంచి జరిగేలా చూడాలని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి విన్నవించారు. మోస్ట్ పాయిజన్ ఫెస్టిసైడ్స్ కూడా మన రాష్ట్రంలో బ్యాన్ కాలేదనీ కనీసం వాటిని పరిమితంగా అమ్మేలా అయిన చర్యలు తీసుకోవాలని కవిత విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
28.02.2026 శనివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**టాప్ 10 మేధావులు**

8. చార్లెస్ డార్విన్
జీవుల పరిణామ సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేశాడు. ప్రకృతి ఎంపిక సిద్ధాంతంతో జీవశాస్త్రాన్ని మార్చేశాడు.



# ఉద్యోగులపెండింగ్ బిల్లుల విడుదల

- రూ.745 కోట్లు రిలీజ్ చేసిన సర్కార్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను ప్రజా ప్రభుత్వం ఒక్కొక్కటీగా అమలు చేస్తోంది. ప్రధానంగా ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సర్కార్ గ్రీన్ ఛానల్ లో నిధులను విడుదల చేస్తున్నది. తాజాగా ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల కోసం రూ.745 కోట్లు విడుదల చేసింది. ఫిబ్రవరి మాసానికి సంబంధించిన బిల్లుల విడుదలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు శుక్రవారం నిధులు విడుదల చేశారు. ఉద్యోగులకు ప్రతినెల రూ. 700 కోట్లకు తగ్గకుండా పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అ హామీ మేరకు గత జూన్ నెలాఖరులో రూ .183 కోట్లు విడుదల చేసింది. గత సంవత్సరం ఆగస్టు నుంచి ప్రతి నెల కనీసంగా రూ .700 కోట్ల చొప్పున విడుదల చేస్తూ వస్తోంది. విడుదలైన బిల్లులో గ్రాట్యూటీ, జిపిఎఫ్, సరెండర్ లీవ్, అడ్వాన్సులు ఉన్నాయి.

**గ్రామపంచాయతీలకు రూ. 389 కోట్లు విడుదల**

గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త వెల్లడించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులు రూ. 389 కోట్లు విడుదల చేశారు.

# నకిలీ సంస్థ పేరిట మ్యూల్ ఖాతాలు

- - బ్యాంకు మేనేజర్ సహా నలుగురి అరెస్ట్

**ముద్ర, శేరిలింగంపల్లి :**



నకిలీ వ్యాపార సంస్థల పేర్లతో మ్యూల్ బ్యాంక్ ఖాతాలు తెరిచి సైబర్ మోసాలకు సహకరిస్తున్న ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో జూబ్లీహిల్స్ మర్కంటైల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్, సేల్స్ మేనేజర్ కూడా ఉన్నారు. సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ టి. సాయి మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీ షరీఫ్‌కు చెందిన జవ్వాద్ ఖాద్రీ రిఫాయి, మహమ్మద్ నౌషాద్ సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలను సమకూర్చేందుకు పథకం పన్నారు. ఇందులో భాగంగా ఒక షట్టర్‌ను అద్దెకు తీసుకుని, 'స్టార్ అగ్రో ఇండస్ట్రీస్' పేరుతో నకిలీ అద్దె ఒప్పందాలు, తప్పుడు వ్యాపార పత్రాలను సృష్టించారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా జూబ్లీహిల్స్ మర్కంటైల్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ సేల్స్ మేనేజర్ పాముల ప్రణవరాజ్, బ్రాంచ్ మేనేజర్ శంకర్ రాథీ సహకారంతో కరెంట్ ఖాతా ప్రారంభించారని తెలిపారు. ఖాతా తెరిచిన వెంటనే దానికి సంబంధించిన ఏటీఎం కార్డు, చెక్ బుక్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలతో పాటు సిమ్ కార్డును కూడా సైబర్ మోసగాళ్లకు అప్పగించారన్నారు. దర్యాప్తులో భాగంగా అక్టోబర్ 2025లో ఈ ఖాతా ద్వారా సుమారు రూ. 6.67 లక్షల మేర అక్రమ లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. నిందితులు పరారీలో ఉండగా, ఫిబ్రవరి 26, 2026న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. సైబర్ క్రైమ్స్ పోలీసు విచారణలో సదరు బ్యాంకు శాఖలోనే దాదాపు 30కి పైగా మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు నిందితులు అంగీకరించారన్నారు. ఈ ముఠా వెనుక ఉన్న ఇతర సభ్యులను, బాధితుల వివరాల కోసం దర్యాప్తు చేస్తామన్నారు. డబ్బు కోసం బ్యాంక్ ఖాతాలు, కేవైసీ పత్రాలను ఇతరులకు ఇవ్వడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. బ్యాంకు సిబ్బంది నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

# ఉపాధ్యాయ వేతనాలపై విద్యా కమిషన్ వ్యాఖ్యలు విడ్డూరం

**- ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏ.వి.సుధాకర్**

**ముద్ర, హైదరాబాద్ :**

తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన "ఎడ్యుకేషన్ పాలసీ ఫర్ తెలంగాణ 2026" రిపోర్టులో "టీచర్లకు జీతాలు ఎక్కువగా ఉన్నాయి" అనే అంశాన్ని చేర్చడం అత్యంత విడ్డూరమని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూటీఎస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఏ.వి. సుధాకర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పుట్టపాక ప్రవీణ్ కుమార్, సత్తు పాండురంగారెడ్డి ఒక ప్రకటనలో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలు ఉపాధ్యాయుల్లో మనోవేదన కలిగించడంతో పాటు, వారి వృత్తి గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఉపాధ్యాయులపై తప్పుడు సంకేతాలు వెళ్ళే ప్రమాదం ఉందన్నారు. భారతదేశంలో పలు రాష్ట్రాలతో పాటు, వివిధ దేశాలలో ఉపాధ్యాయుల వేతనాలు తెలంగాణ రాష్ట్రం కంటే ఎక్కువ ఉన్నాయని గుర్తు చేశారు. విద్యా కమిషన్ తన పరిధి దాటి, ఈ విధంగా ప్రస్తావించడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేసి పాఠశాలల పరిస్థితులు, విద్యా ప్రమాణాల పెంపు, విద్యా రంగ పురోగతిపై ప్రభుత్వానికి మంచి నివేదిక అందిస్తారని ఆశించామని, ఉపాధ్యాయుల జీతభత్యాలు, ఉపాధ్యాయ నియామక అర్హతలు, పదోన్నతులు వంటి అంశాలను ప్రతికూలంగా ప్రస్తావించడం దురదృష్టకరమన్నారు. వేతనాల నిర్ణయం అనేది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల ఆధారంగా శాస్త్రీయ పద్ధతిలో "పే రివిజన్ కమిషన్" (పి.ఆర్.సి.) ల పరిధిలో ఉండే విషయమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దాదాపు మూడేళ్ళుగా పి.ఆర్.సి, నాలుగు డి. ఏలు, పెండింగ్ బిల్లులు లేక ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఇలాంటి వ్యాఖ్యలు ఉపాధ్యాయ లోకంలో విస్మయానికి గురి చేస్తున్నాయని అన్నారు. ఉపాధ్యాయుల గౌరవం, మనోభావాలను కాపాడేలా ప్రభుత్వం ఇట్టి వ్యాఖ్యలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

# మార్చి 4 నుంచి వంద రోజుల ఆరోగ్య కార్యక్రమం

**- రంగారెడ్డి డీఎంహెచ్ఓ డాక్టర్ లలితాదేవి**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

జిల్లాలో ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు వంద రోజుల ఆరోగ్య కార్యక్రమాన్ని మూడు దశలలో అమలు చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే లలితాదేవి తెలిపారు. మొదటి దశ మార్చి 4 నుంచి మార్చి 31 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్పెషలిస్ట్ వైద్యులు నిర్ణయించిన తేదీలలో క్యాంపులు ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పరీక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహక సమావేశము జిల్లా డిప్యూటీ జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ప్రత్యేక జేరియాట్రిక్ క్యాంపులు నిర్వహించి రక్కపోటు మధుమేహం, గ్రామ పట్టణ స్థాయిలో విస్తృత స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. ఆర్బీఎస్కే వైద్యుల ద్వారా రెసిడెన్షియల్ పాఠశాలలో కంటి పరీక్షలు రక్తహీనత పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారులు గీతా, రాధిక, పాపారావు, లక్ష్మీప్రసన్న, ప్రోగ్రాం అధికారులు శిభా హయత్, డెమో శ్రీనివాసులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు..

# తెలంగాణ సాంస్కృతిక గుర్తింపు పొందాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- సాంస్కృతిక అవగాహన లేనిదే సమాజం అభివృద్ధి సాధ్యం కాదు
- సంప్రదాయ కళలపై ఆసక్తి, కళాకారులకు గౌరవం భేష్
- ఘనంగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమం ప్రారంభోత్సవం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




తెలంగాణ యువ రాష్ట్రంగా సాంస్కృతిక గుర్తింపును బలోపేతం చేసుకోవడం అవసరమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వెల్లడించారు. సంస్కృతి సమాజానికి ఆత్మస్వరూపం అన్న ఆయన సాంస్కృతిక అవగాహన లేకుండా సమాజం అభివృద్ధి సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఈ తరహా కార్యక్రమాలు యువతలో సంప్రదాయ కళలపై ఆసక్తిని పెంచడంతో పాటు కళాకారులకు గౌరవాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా 'జీఐ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని గవర్నర్ శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడారు. జీఐ గుర్తింపు పొందిన కళారూపాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వాటిని ప్రాచుర్యంలోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జీఐ ఉత్పత్తుల ప్రాచుర్యం, మార్కెటింగ్, విస్తరణకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఈ చర్యల ద్వారా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని వివరించారు. టీజీఎస్ఆర్టీసీ ద్వారా ఈ కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. , ఈ కార్యక్రమం గవర్నర్ దూరదృష్టి ఫలితమని తెలిపారు. ఈ మేరకు పోచంపల్లి ఇక్కత్ వరంగల్, వరంగల్ తివాచీలు (కార్పెట్లు), కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నారాయణపేట్ చీరలు, చెరియల్ స్క్రోల్ పెయింటింగ్స్, నిర్మల్ పెయింటింగ్స్ వంటి తెలంగాణకు చెందిన ఆరు ప్రముఖ జీఐ హస్తకళలను బస్సులపై ప్రత్యేకంగా ప్రతిష్టించారు. కాగా ఈ కళారూపాలు తెలంగాణ కళాకారుల నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తూ, ప్రజా రవాణా ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం పొందనున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థను సృజనాత్మక వేదికగా మలచి, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చేపట్టటం జరిగిందని మంత్రి స్పష్టం చేశారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం గవర్నర్ ఆలోచనల ఫలితమన్నారు. బస్సులపై జీఐ కళారూపాలను ప్రదర్శించడం ద్వారా సంస్కృతిని ప్రజలకు చేరువ చేయడంతో పాటు కళాకారులకు ప్రోత్సాహం అందించవచ్చని చెప్పారు. ఈ బస్సులపై ప్రదర్శించిన డిజైన్లను జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులు మెమొంటోలు అందజేశారు. జీఐ గుర్తింపుల సాధనలో సేవలందించిన సుభజిత్ సహా ప్రత్యేకంగా సన్మానించారు. ఆరు జీఐ కళారూపాలకు చెందిన కళాకారులను కూడా ఘనంగా సత్కరించారు. తదనంతరం గవర్నర్, మంత్రి, జిల్లా కలెక్టర్, టీజీఎస్ఆర్టీసీ అధికారులు కలిసి జీఐ హస్తకళలతో అలంకరించిన ప్రత్యేక బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. కాగా భౌగోళిక సూచిక (జీఐ) అనేది ఒక ప్రాంతానికి ప్రత్యేకమైన ఉత్పత్తి లక్షణాలు, నైపుణ్యం, సంప్రదాయాన్ని ప్రతిబింబించే సమిష్టి మేధో సంపత్తి హక్కు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రానికి 18 జీఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులు ఉన్నాయి. జీఐ గుర్తింపు ద్వారా సంప్రదాయ కళలు, వారసత్వాన్ని సంరక్షించడం, నకిలీలను నివారించడం, కళాకారులకు గుర్తింపు కల్పించడం, వారి జీవనోపాధిని స్థిరంగా నిలుపుటకు దోహదపడుతుంది. ఈ కార్యక్రమంలో టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రాజశేఖర్, ఖుస్రో షా ఖాన్, రీజినల్ మేనేజర్లు శ్రీలత, సుధ పరిమళ, జేఎన్ఏఎఫ్ఏయూ ప్రతినిధులు, కళాకారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బొత్స సత్యనారాయణకు బ్రెయిన్ స్ట్రోక్

- సీరియస్ కావడంతో హుటాహుటిన హైదరాబాద్ కు!
- వైసీపీ శ్రేణుల్లో ఆందోళన
- సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స
- సీనియర్ నేత ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు.. అభిమానుల్లో టెన్షన్
- రాజకీయంగా కీలక నేతకు అస్వస్థత.. పార్టీ వర్గాల్లో ఆందోళన వాతావరణం

**ముద్ర న్యూస్ :**



వైఎస్ఆర్ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్ కు తరలించారు. శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాదులోని సిటీ న్యూరో సెంటర్లో చేర్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో బొత్స సత్యనారాయణకు చికిత్స కొనసాగుతోంది. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు ప్రకటించాయి. అయితే ఆయనకు మైల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లోనూ, బొత్స అభిమానుల్లోనూ ఆందోళన నెలకొంది.

**మొన్న ఆమధ్య..**

సీనియర్ నేతగా ఉన్న బొత్స ఇటీవల అనారోగ్యానికి గురికావడం సర్వసాధారణంగా మారింది. ఆయన సొంత నియోజకవర్గంలో కొద్ది నెలల కిందట ఓ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సమయంలో కూడా వేదికపై స్పృహ కోల్పోయారు. వెంటనే పార్టీ నేతలు విజయనగరంలోని ఓ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. తరువాత ఆయన కోలుకున్నారు. ప్రస్తుతం ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్గా కొనసాగుతున్నారు. శాసనమండలిలో వైసిపి పక్ష నేతగా కూడా ఉన్నారు. చీపురుపల్లి నుంచి ఓడిపోయిన తర్వాత విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇచ్చారు జగన్. ఎమ్మెల్సీ గా ఎన్నికైన తర్వాత ఏకంగా శాసనమండలిలో విపక్ష నేత పదవి కట్టబెట్టారు. అది క్యాబినెట్ హోదాతో కూడుకున్న పదవి. శాసనసభలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడంతో ప్రతిపక్ష హోదా దక్కలేదు. కానీ శాసనమండలిలో మాత్రం బొత్స నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గట్టిగానే పోరాటం చేస్తోంది.

**సుదీర్ఘ రాజకీయ నేపథ్యం..**

ఒక సాధారణ పిఎసిఎస్ అధ్యక్షుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు బొత్స సత్యనారాయణ. 1999లో తొలిసారిగా బొబ్బిలి పార్లమెంట్ స్థానం నుంచి విజయం సాధించారు. 2004లో చీపురుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి గెలిచి వైయస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినెట్లో కొనసాగారు. 2009లో రెండోసారి గెలిచి మరోసారి మంత్రి పదవి చేపట్టారు. రాజశేఖర్ రెడ్డి మరణించిన తర్వాత ముఖ్యమంత్రిగా బొత్స పేరు ప్రముఖంగా వినిపించింది. వివిధ సమీకరణలో భాగంగా ఆయనకు పదవి దక్కలేదు. కానీ ఉమ్మడి రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పదవి కట్టబెట్టారు. 2014లో కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన అదే పార్టీ తరఫున మూడోసారి చీపురుపల్లి నుంచి పోటీ చేశారు. రాష్ట్రంలో ఈ కాంగ్రెస్ అభ్యర్థి కూడా డిపాజిట్లు దక్కించుకోలేదు. కానీ చీపురుపల్లిలో మాత్రం రెండో స్థానంలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టగలిగారు బొత్స. 2019లో చీపురుపల్లి నుంచి గెలిచిన బొత్సను క్యాబినెట్ లోకి తీసుకున్నారు జగన్. ఐదేళ్లపాటు మంత్రిగా కొనసాగారు. కానీ మొన్నటి ఎన్నికల్లో బొత్స తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా ఓడిపోయారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి బొత్స ఫ్యామిలీకి ప్రాధాన్యమిస్తున్న క్రమంలో.. ఆయన అనారోగ్యానికి గురి కావడం ఆందోళన కలిగిస్తోంది

# మేడ్చల్ లో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ముద్ర, మేడ్చల్ జిల్లా ప్రతినిధి:**

మేడ్చల్ జిల్లా పరిధిలో మొత్తం 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ సుగుణ బాయి, వ్యవసాయ విస్తరణాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన వడ్ల లో ఎలాంటి దుమ్ము, తడి లేకుండా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తరలించే విధంగా వారిని చైతన్య పర్చాలని ఆదేశించారు. రైతులు ధాన్యం అమ్మిన 48 గంటల లోగా వారి ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని తెలిపారు.

# కొత్త డస్టర్ రాబోతోంది..

- అధికారిక తేదీని ప్రకటించిన రెనాల్ట్.. ఎప్పుడంటే?

**ముద్ర న్యూస్ :**




ఒకప్పుడు సంచలనం సృష్టించిన రెనాల్ట్ డస్టర్ ఇప్పుడు మళ్లీ కొత్తగా రూపుదిద్దుకొని రాబోతుంది. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రకటించిన కంపెనీ ఇప్పుడు దీనిని డెలివరీ చేయడానికి సిద్ధమవుతోంది. ఇప్పటికే జనవరి 26 నుంచి ముందస్తు బుకింగ్ ప్రారంభం చేసిన ఈ కంపెనీ త్వరలోనే దీనిని డెలివరీ చేయనుంది. అయితే రెనాల్ట్ డస్టర్ ఎలా ఉండబోతుందో తెలుసుకోవాలని చాలామంది ఆసక్తి చూపుతున్నారు. ఇంకొందరు దీనిని సొంతం చేసుకోవడానికి బుకింగ్ చేసుకుంటున్నారు. ఇంతకీ ఈ బైక్ ఎలా ఉండబోతుంది? దీని ధర ఎంత?...రెనాల్ట్ కొత్త డస్టర్ మార్చి 17న మార్కెట్లోకి రానుంది. ఎస్‌యూవీ వేరియంట్‌లో వస్తున్న ఈ బైక్ బాహ్య రూపకల్పన విషయానికి వస్తే దీనికి ఎల్ఈడీ హెడ్ ల్యాంపులు ఉండనున్నాయి. ఇవి ప్రీమియం లుక్‌తో ఆకర్షిస్తున్నాయి. 18 అంగుళాల అలాయ్ వీల్స్ ప్రత్యేక ఆకర్షణ. ఎస్‌యూవీ కార్లలోనే శక్తివంతమైన డస్టర్‌గా నిలవనుంది. ఇందులో పెట్రోల్‌తో పాటు ఎలక్ట్రిక్ కలిపి హైబ్రిడ్ ఇంజిన్‌ను చేర్చారు. 1.8 లీటర్ పెట్రోల్ ఇంజిన్ ఉండగా ఇది 160 హార్స్ పవర్‌తో పాటు 172 ఎన్ఎమ్ టార్క్‌ను విడుదల చేస్తుంది. అలాగే ఇందులో ఎలక్ట్రిక్ ఇంజిన్ కూడా సపోర్ట్ చేయనుంది. ఈ ఇంజిన్ 5 స్పీడ్ మాన్యువల్, 6 స్పీడ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్‌తో పనిచేయనుంది. అలాగే ఈ హైబ్రిడ్ ఇంజిన్ 13.9 నుంచి 19.87 వరకు మైలేజ్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ కొత్త డస్టర్ కారులో ఆకట్టుకునే స్మార్ట్ ఫీచర్లు ఉన్నాయి. 10 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వైర్లెస్ మొబైల్ చార్జర్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, పనోరమిక్ సన్‌రూఫ్ వంటివి సౌకర్యవంతంగా ఉండనున్నాయి. అలాగే సేఫ్టీ విషయంలోనూ ఈ డస్టర్ ప్రత్యేకంగా నిలవనుంది. ఇందులో 6 ఎయిర్ బ్యాగ్స్, లెవెల్ 2 ఏడీఏఎస్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, డిస్క్ బ్రేక్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 360 డిగ్రీ కెమెరా వంటి లేటెస్ట్ ఫీచర్లు ఉన్నాయి. అయితే దీని ధర విషయంలో ఇప్పటికే చాలామంది అయోమయంలో ఉన్నారు. కానీ కంపెనీ మాత్రం అధికారికంగా దీని ధరను ప్రకటించింది. కొత్త రెనాల్ట్ డస్టర్ ధర రూ.9.50 లక్షల ప్రారంభ ధర నుంచి రూ.19 లక్షల వరకు ఉంటుంది. దీంతో కొత్తగా ఎస్‌యూవీ కొనాలని అనుకునేవారు, సౌకర్యవంతంగా కారు ఉండాలని అనుకునేవారు దీనికి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే మార్చిలో ఇది మార్కెట్లోకి వచ్చిన తర్వాత ఎలాంటి అమ్మకాలు ఉంటాయో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శనివారం 28.02.2026


www.mudranews.in | @mudranews



టాప్ 10 మేధావులు

**9. అరిస్టాటిల్**

తత్వశాస్త్రం, శాస్త్రం, రాజకీయాల్లో విస్తృతమైన ఆలోచనలు అందించాడు. పాశ్చాత్య తత్వశాస్త్రానికి బలమైన పునాది వేసిన మేధావి.








## వర్షం పడితే టీమిండియా సెమీస్ ఆశలు గల్లంతేనా?!

సెమీస్ రేసులో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ సత్తా చాటింది. చెన్నైలో జరిగిన సూపర్-8 పోరులో జింబాబ్వేపై 72 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇదే సమయంలో సౌతాఫ్రికా ఇప్పటికే సెమీస్ స్థానం ఖరారు చేసుకోగా, జింబాబ్వే టోర్నీ నుంచి తప్పుకుంది. దీంతో రెండో బెర్త్ కోసం భారత్, వెస్టిండీస్ మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది.ఆదివారం కోల్‌కతాలో జరిగే మ్యాచ్ ఇరు జట్లకు క్వార్టర్ ఫైనల్ తరహాలో మారింది. గెలిచిన జట్టు సెమీస్‌కు చేరుకోగా, ఓడిన జట్టు నిష్క్రమిస్తుంది. సాధారణ పరిస్థితుల్లో విజయం కీలకం కాగా, మ్యాచ్ రద్దైతే రన్‌రేట్ నిర్ణయాత్మకమవుతుంది. ప్రస్తుతం వెస్టిండీస్ రన్‌రేట్ +1.791గా బలంగా ఉండగా, భారత్ -0.100తో వెనుకబడి ఉంది. సౌతాఫ్రికా చేతిలో భారీ ఓటమి భారత్‌కు ప్రతికూలంగా మారింది. జింబాబ్వేపై పెద్ద విజయం సాధించినప్పటికీ రన్‌రేట్ పూర్తిగా పాజిటివ్‌లోకి రాలేదు. మరో ముఖ్య విషయం ఏమిటంటే, సూపర్-8 దశకు రిజర్వ్ డే లేదు. కాబట్టి ఏ కారణంతోనైనా మ్యాచ్ రద్దైతే మెరుగైన రన్‌రేట్ ఉన్న వెస్టిండీస్ సెమీస్ చేరుతుంది. భారత్ ప్రయాణం అక్కడితో ముగుస్తుంది. అందువల్ల కోల్‌కతా పోరు భారత్‌కు 'చేయి గెలుపు - చేయి నిష్క్రమణ' తరహాలో మారింది.

## నాకౌట్ మ్యాచుల్లోనూ వీళ్లది దూకుడే..

### టాప్ -5లో ఇద్దరు టీమిండియా ప్లేయర్లే

### అగ్రస్థానంలో కోహ్లీ

ఐసీసీ టోర్నీల్లో నాకౌట్ దశ అనేది అసలైన పరీక్ష. ఒక్క తప్పు మ్యాచ్ ఫలితాన్ని మార్చేస్తుంది. అలాంటి ఒత్తిడిలో పరుగులు చేయడం అంత సులువు కాదు. అయినా టీ20 ప్రపంచకప్ చరిత్రలో కొందరు బ్యాట్స్‌మెన్లు ఈ దశలో అద్భుత ప్రదర్శనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో టీమిండియా స్టార్ బ్యాట్స్‌మన్ విరాట్ అగ్రస్థానంలో నిలిచాడు. కోహ్లీ ఆరు నాకౌట్ మ్యాచ్‌ల్లో 373 పరుగులు సాధించాడు. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా బ్యాటింగ్ చేయడం, చేజింగ్‌లో జట్టును విజయానికి చేర్చడం అతని ప్రత్యేకత. సెమీఫైనల్, ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌ల్లో కోహ్లీ బ్యాట్ గర్జించింది. 2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్లో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచి మరోసారి తన స్థాయి చాటుకున్నాడు. రెండో స్థానంలో టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ ఉన్నాడు. ఎనిమిది నాకౌట్ మ్యాచ్‌ల్లో 227 పరుగులు చేశాడు. దూకుడు ఆటతో పాటు ఆరంభంలోనే బలమైన పునాది వేయడం రోహిత్ ప్రత్యేకత. పెద్ద మ్యాచ్‌ల్లో అతని అనుభవం జట్టుకు కీలకంగా మారింది. అతని కెప్టెన్సీలో భారత్ 2024 టీ20 ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. మూడో స్థానంలో ఇంగ్లాండ్ కెప్టెన్ బట్లర్ నిలిచాడు. ఆరు నాకౌట్ మ్యాచ్‌ల్లో 226 పరుగులు నమోదు చేశాడు. పేలుడు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను ఒక్కసారిగా మలుపుతిప్పగల సామర్థ్యం బట్లర్‌కు ఉంది. అతని నాయకత్వంలో ఇంగ్లాండ్ 2022 టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. వెస్టిండీస్‌కు చెందిన శామ్యూల్స్ నాలుగో



స్థానంలో ఉన్నాడు. ఐదు నాకౌట్ మ్యాచ్‌ల్లో 215 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 2012, 2016 టీ20 ప్రపంచకప్ ఫైనల్స్‌లో అతను ఆడిన మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ వెస్టిండీస్‌కు టైటిల్ అందించాయి. పెద్ద మ్యాచ్‌ల్లో నిలబడ్డ ఆటగాడిగా శామ్యూల్స్ గుర్తింపు పొందాడు. ఐదో స్థానంలో శ్రీలంక మాజీ దిగ్గజం దిల్షాన్ ఉన్నాడు. ఆరు నాకౌట్ మ్యాచ్‌ల్లో 197 పరుగులు చేశాడు. హెలికాప్టర్ తరహా స్కూప్ షాట్‌లతో వినూత్న శైలిని చూపిన దిల్షాన్, కీలక దశల్లో శ్రీలంకను ఫైనల్ వరకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాడు. నాకౌట్ మ్యాచ్‌లు ఒత్తిడితో కూడుకున్నవే అయినా, ఈ బ్యాట్స్‌మెన్లు తమ ప్రతిభతో వాటిని సువర్ణ అవకాశాలుగా మలిచారు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో వీరి ఇన్నింగ్స్‌లు ప్రత్యేక స్థానం సంపాదించాయి.





## మహమ్మద్ అమీర్ వ్యాఖ్యలపై దుమారం

### అభిషేక్‌శర్మ ఇన్నింగ్స్‌తో సమాధానం

టీ20 వరల్డ్ కప్2026 ప్రారంభం నుంచే భారత జట్టుపై పాకిస్థాన్ మాజీ పేసర్ మహమ్మద్ అమీర్ తీవ్ర విమర్శలు చేస్తూ వస్తున్నాడు. గ్రూప్-1 నుంచి భారత్ సెమీస్ చేరదని, సౌతాఫ్రికా-వెస్టిండీస్ మాత్రమే ముందుకు వెళ్తాయని అతను అభిప్రాయపడ్డాడు. భారత బ్యాటింగ్ బలహీనమైందని, ఓపెనర్ అభిషేక్ శర్మకు సరైన టెక్నిక్ లేదని కూడా వ్యాఖ్యానించాడు. అయితే జింబాబ్వేపై జరిగిన కీలక మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఈ పోరులో అభిషేక్ శర్మ 30 బంతుల్లో 55 పరుగులు చేసి అర్ధశతకం సాధించాడు. దాంతో అమీర్ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. భారత అభిమానులు అతనిపై తీవ్రంగా స్పందిస్తూ కౌంటర్ కామెంట్లు చేస్తున్నారు. టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా అమీర్ వ్యాఖ్యలను ఖండించాడు. అభిషేక్ కేవలం స్లాగర్ కాదని, అతని బ్యాట్ స్వింగ్ ప్రత్యేకమని పేర్కొన్నాడు. ప్రతీ బంతిని బలంగా ఆడడం తప్పే కావొచ్చు గానీ, ప్రతిభను తక్కువ అంచనా వేయడం సరికాదని సూచించాడు. మొత్తానికి, మైదానంలో ఇచ్చే సమాధానమే అసలైన ప్రతిస్పందన అని భారత జట్టు మరోసారి చూపించింది.

## అభిషేక్ పై యువరాజ్ ప్రశంసలు



చెన్నైలో జరిగిన టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లో జింబాబ్వేపై భారత్ 72 పరుగుల తేడాతో గెలిచి సెమీఫైనల్ ఆశలను నిలబెట్టుకుంది. వరుస వైఫల్యాల తర్వాత అభిషేక్ శర్మ తొలి అర్ధశతకం సాధించి ఫామ్‌లోకి వచ్చాడు. అభిషేక్ ఇన్నింగ్స్‌పై మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ప్రశంసలు కురిపిస్తూ సోషల్ మీడియాలో ప్రోత్సహించారు. జట్టు నమ్మకమే తన విజయానికి కారణమని అభిషేక్ పేర్కొన్నాడు. సంజూ శాంసన్ వేగవంతమైన ఆరంభం ఇవ్వగా, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ రాణించడంతో భారత్ భారీ స్కోర్ నమోదు చేసింది. అనంతరం జింబాబ్వే లక్ష్యచేదనలో విఫలమైంది.

### భారత్-జింబాబ్వే మ్యాచ్‌లో

## మిస్టరీ గర్ల్... కెమెరాలన్నీ ఆమెపైనే

టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా జరిగిన భారత్-జింబాబ్వే మ్యాచ్ సందర్భంగా ఓ యువతి టీవీ ప్రసారంలో కనిపించి ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. ఆమెను కెమెరా పలుమార్లు చూపించడంతో సోషల్ మీడియాలో ఫొటోలు వేగంగా వైరల్ అయ్యాయి. మ్యాచ్ పూర్తయ్యేలోపే నెటిజన్లు ఆమెను "మిస్టరీ గర్ల్"గా ట్రెండ్ చేశారు. ఆమె నవ్వు, హావభావాలు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో చాలామంది ఆమె వివరాల కోసం వెతకడం ప్రారంభించారు. కెమెరామెన్‌పై సరదా కామెంట్లు కూడా వెల్లువెత్తాయి.

**ఆ యువతి ఎవరు?**

ఆమె పేరు సైనా భాన్. సైనా భాన్ నటి, ఫిల్మ్ మేకర్, పాడ్‌కాస్టర్‌గా గుర్తింపు పొందింది. మేడిన్ హెవెన్ లో 'దిల్‌షాద్' పాత్రతో ఆమెకు పేరు వచ్చింది. అలాగే క్లాస్ 'కోయల్ కల్రా'గా నటించి మరింత పాపులర్ అయింది.

నటనతో పాటు ఆమె లైఫ్‌స్టైల్ కంటెంట్ క్రియేటర్‌గా, సింగర్‌గా కూడా కొనసాగుతూ సోషల్ మీడియాలో తన ప్రాజెక్టులు, ముంబై లైఫ్‌స్టైల్ గురించి పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది.





## ఆకిబ్ నబీపై సౌరవ్ గంగూలీ ప్రశంసలు

జమ్మూ కశ్మీర్ యువ పేసర్ ఆకిబ్ నబీ ప్రదర్శనపై మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ప్రశంసలు కురిపించారు. రంజీ ట్రోఫీ 2025-26 సీజన్‌లో 60 వికెట్లు సాధించి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచిన నబీని భారత టెస్ట్ జట్టులోకి ఎంపిక చేయాలని, ఇంగ్లండ్ పర్యటనకు తీసుకెళ్లాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా తెలియజేస్తూ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ను ట్యాగ్ చేశారు. కర్ణాటకతో జరుగుతున్న ఫైనల్లోనూ నబీ 5/54తో మెరిసాడు. రంజీ చరిత్రలో ఒకే సీజన్‌లో 60కిపైగా వికెట్లు తీసిన అరుదైన బౌలర్ల జాబితాలో చోటు సంపాదించాడు. ఫైనల్‌లో జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగులు చేసి, ప్రత్యర్థిని 293కే పరిమితం చేసి 301 పరుగుల ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ జట్టు ఆధిక్యంలో ఉంది. మ్యాచ్ డ్రాగా ముగిసినా తొలి ఇన్నింగ్స్ లీడ్ ఆధారంగా జమ్మూ కశ్మీర్‌కు టైటిల్ దక్కే అవకాశముంది. మొత్తానికి, నబీ ప్రదర్శన జాతీయ ఎంపిక దిశగా చర్చకు దారి తీసింది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 28.02.2026
www.mudranews.in | @mudranews

# సినిమా
# Movie

# ది కేరళ స్టోరీ 2 విడుదలపై ఉత్కంఠ

కోర్టు తీర్పులతో మారిన పరిస్థితి

సినిమా కథ కంటే ఎక్కువ మలుపులు తిరుగుతోంది ది కేరళ స్టోరీ 2 విడుదల వ్యవహారం. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం అనూహ్యంగా న్యాయపరమైన అడ్డంకిని ఎదుర్కొంది. కొందరు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన కేరళ హైకోర్టు తొలుత చిత్ర ప్రదర్శనపై తాత్కాలిక నిలుపుదల విధించింది. ఈ నిర్ణయం నిర్మాతలతో పాటు ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రేక్షకుల్లోనూ సందిగ్ధత కలిగించింది. అయితే చిత్రబృందం వెంటనే డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. అక్కడ పరిస్థితి మారింది. ముందుగా విధించిన ఆంక్షలను రద్దు చేస్తూ బెంచ్ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విడుదలకు మరోసారి మార్గం సుగమమైంది. ప్రస్తుతం ఉన్న ఆదేశాల ప్రకారం, పైస్థాయి న్యాయస్థానంలో ఎవరైనా సవాల్ చేస్తే తప్ప సినిమా ప్రదర్శన ఆగే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే దేశవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ నిలిపివేయబడి, కొంతమందికి రీఫండ్లు కూడా జారీ అయ్యాయి. ఇప్పుడు తాజా తీర్పు నేపథ్యంలో మళ్లీ బుకింగ్స్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన వెలువడిన తర్వాత థియేటర్ల షెడ్యూళ్లు స్పష్టమయ్యే అవకాశముంది. చిత్రానికి లభించిన ప్రధాన బలం ఏమిటంటే, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి ఇప్పటికే సర్టిఫికెట్ పొందడం. సెన్సార్ అనుమతి ఉన్నందున చట్టపరంగా విడుదల హక్కు నిర్మాతకు ఉంటుంది. అయితే కోర్టు వ్యవహారాలు మళ్లీ తలెత్తితే పరిస్థితి మారే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేం. సోషల్ మీడియాలో మాత్రం ఈ సినిమా చుట్టూ చర్చలు వేడెక్కుతున్నాయి. కొందరు దీనిని వాదప్రధాన చిత్రం అంటూ విమర్శిస్తుండగా, నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా మాత్రం తమ చిత్రం వాస్తవాల ఆధారంగా రూపొందించబడిందని చెబుతున్నారు. ముందుగా సినిమా చూసి తర్వాతే అభిప్రాయం వ్యక్తం చేయాలని ఆయన సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ది కేరళ స్టోరీ 2 విడుదల కేవలం ఒక సినిమా రిలీజ్ కాకుండా, న్యాయపరమైన పోరాటం, సామాజిక చర్చ, రాజకీయ ప్రతిస్పందనల సమ్మేళనంగా మారింది. ఇకపై ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నదే ఆసక్తికర అంశం. థియేటర్లలో ఈ సినిమా ఎప్పుడు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నది త్వరలో స్పష్టమవుతుంది.






# ప్రధానిని కలిసిన విరోష్ జోడీ

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా దంపతులు భారత ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు సమాచారం. హైదరాబాద్‌లో మార్చి 4న నిర్వహించనున్న తమ వివాహ విందుకు ఆయనను ఆహ్వానించినట్టు తెలుస్తోంది. ప్రధానితో కలిసి తీసుకున్న ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే ఈ వేడుకకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులను ఆహ్వానించినట్టు సమాచారం. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఈ రిసెప్షన్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్లో వీరి వివాహం సాదాసీదాగా జరిగింది. ఆ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులే హాజరయ్యారు. అందుకే హైదరాబాద్‌లో సినీ, రాజకీయ రంగాల ప్రముఖులతో భారీ స్థాయిలో రిసెప్షన్‌ను ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశముంది.



# విడాకుల బాటలో తళపతి విజయ్?

తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కజగం అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం గురించి ఇటీవలి రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఆయన భార్య సంగీత సోర్నలింగం విడాకుల కోసం కోర్టును ఆశ్రయించినట్లు పలు మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. 1999 ఆగస్టులో వివాహం చేసుకున్న ఈ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. దాదాపు పావు శతాబ్దం పాటు సాగిన దాంపత్య జీవితం ఇప్పుడు ముగింపు దశకు చేరుకుందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొన్ని కథనాల ప్రకారం ప్రత్యేక వివాహ చట్టం-1954 కింద పిటిషన్ దాఖలైనట్టు సమాచారం. అయితే దీనిపై అధికారిక ధృవీకరణ లేదు. ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే, విజయ్ గానీ, ఆయన కుటుంబ సభ్యులు గానీ ఇప్పటివరకు ఈ అంశంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. అందువల్ల ఇవన్నీ ప్రస్తుతానికి ప్రచారంలో ఉన్న వార్తలుగానే భావించాలి. అధికారిక స్పందన వెలువడిన తర్వాతే వాస్తవ పరిస్థితి స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# సహజత్వం పేరుతో ఆ సన్నివేశాలు వద్దు : భాగ్యశ్రీ



పెళ్లి తర్వాతే వెండితెరకు వచ్చిన అరుదైన కథానాయికల్లో భాగ్యశ్రీ ఒకరు. మైనే ప్యార్ కియాలో సల్మాన్ ఖాన్ సరసన నటించి తక్కువకాలంలోనే గుర్తింపు పొందింది. ప్రస్తుతం సహాయక పాత్రల్లో కనిపిస్తోంది. ఇటీవల ఆమె మాట్లాడుతూ, 1990 దశకంలో కుటుంబ వినోదానికి సినిమా ప్రధాన మార్గమని గుర్తుచేసుకుంది. ఇప్పుడు మాత్రం అనేక వినోద వేదికలు రావడంతో ప్రేక్షకుల అభిరుచులు మారిపోయాయని చెప్పింది. అందరినీ మెప్పించడం కష్టమైందని అభిప్రాయపడింది. సహజత్వం పేరుతో రొమాంటిక్ సన్నివేశాలను బలవంతంగా చొప్పించాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేసింది. కుటుంబంతో కలిసి చూస్తున్నప్పుడు కొన్ని సన్నివేశాలు అసౌకర్యం కలిగిస్తాయని తెలిపింది. ఇటీవల రాధేశ్యామ్లో ప్రభాస్ తల్లిగా నటించిన ఆమె, ఇప్పుడు 'రాజా శివాజీ' చిత్రంతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

# స్పిరిట్ నుంచి మరో అప్ డేట్

## విలన్‌గా వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల



ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ స్పిరిట్ ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమా నుంచి తాజాగా ఆసక్తికర సమాచారం బయటకు వచ్చింది. ఇందులో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్న వివేక్ ఒబెరాయ్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇప్పటివరకు చూడని కొత్త గెటప్‌లో ప్రభాస్ కనిపించనున్నారని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలో ఆయన పోలీస్ అధికారిగా నటిస్తుండగా, కథలో మాఫియా నేపథ్యానికి కూడా ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. యాక్షన్, భావోద్వేగాలు కలగలిసిన కథతో సినిమా రూపొందుతోందని సమాచారం. కథానాయికగా త్రిప్తి దిమ్రీ నటిస్తోంది. అలాగే సీనియర్ నటి కాంచన కీలక పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో విడుదల చేయాలనే ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. విడుదల తేదీగా 2027 మార్చి 5ను నిర్ణయించారు. టి-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ సంస్థలపై ప్రణయ్ రెడ్డి వంగా, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# వారణాసి అందాల జ్వాల

అంతర్జాతీయ వేదికపై మరోసారి తన స్టైల్‌తో ఆకట్టుకుంది ప్రియాంక చోప్రా. పారదర్శక నలుపు లేస్ గౌన్‌పై న్యూడ్ షేడ్ బేస్‌తో రూపొందిన దుస్తులు ఆమెకు ప్రత్యేక ఆకర్షణను తెచ్చాయి. పైగా ఓవర్‌సైజ్ ఫర్ కోట్ జత చేయడంతో పిరేట్-శైలి లుక్‌ను ప్రతిబింబించింది. సన్నని లేస్ పనితనం, నిలువు మడతల డిజైన్ ఆమె శరీరాకృతిని మరింత ఆకర్షణీయంగా చూపించాయి. స్లీవ్‌లెస్ ఫిటెడ్ బాడిస్‌తో పాటు నేలవరకు వచ్చిన పొడవైన డిజైన్ రెడ్ కార్పెట్ మెరుపును అందించింది. తక్కువ గోల్డ్ ఆభరణాలు, బర్గండీ టోన్ వేవీ హెయిర్ స్టైల్, బోల్డ్ ఐ మేకప్‌తో ఆమె తన స్టైలింగ్‌ను సాదాసీదాగా ఉంచి దుస్తులకే ప్రాధాన్యం ఇచ్చింది. ఇదే సందర్భంలో ఆమె తన కొత్త చిత్రంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆరు-ఏడు సంవత్సరాలుగా భారతీయ చిత్రంలో నటించలేదని, ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో ఉత్సాహంగా ఉన్నానని తెలిపింది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళిను దేశంలో అత్యంత ప్రతిభావంతులైన దర్శకుల్లో ఒకరుగా ప్రశంసించింది. ఈ చిత్రం అడ్వెంచర్ నేపథ్యంతో రూపొందుతోందని, ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నామని

# తాప్సీ యూటర్న్..

## టాలీవుడ్‌పై ప్రశంసలు



సౌత్ సినీ పరిశ్రమపై, ముఖ్యంగా టాలీవుడ్‌పై తాప్సీ చేసిన వ్యాఖ్యలు ఇటీవల పెద్ద చర్చకు దారి తీశాయి. తన కెరీర్ ఆరంభ దశలో ఎదురైన అనుభవాలను పంచుకుంటూ, గ్లామర్ సన్నివేశాలు, పాటల చిత్రీకరణ సమయంలో మరింత ఆకర్షణీయంగా కనిపించాలనే పేరుతో కొన్ని సూచనలు వచ్చేవని ఆమె పేర్కొంది. ఈ వ్యాఖ్యలపై విమర్శలు రావడంతో తాజాగా ఆమె మరో కోణాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. తెలుగు సినిమాల్లో నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు ఎక్కువగా లభించాయని తాప్సీ వెల్లడించింది. తమిళంతో పోలిస్తే టాలీవుడ్ తనకు మెరుగైన అవకాశాలు ఇచ్చిందని చెప్పింది. తన ప్రతిభను గుర్తించిన ప్రేక్షకులు తెలుగువారేనని, ఇక్కడి అభిమానమే తన కెరీర్‌కు బలమైందని పేర్కొంది. టాలీవుడ్‌లో వచ్చిన అవకాశాల వల్లే తన మార్కెట్ విలువ పెరిగిందని ఆమె స్పష్టం చేసింది. తాప్సీ హీరోయిన్‌గా పరిచయమైన చిత్రం ఝుమ్మంది నాదం. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించిన ఆమె, చివరిసారిగా మిషన్ ఇంపాజిబుల్లో కనిపించింది. ప్రస్తుతం ఆమె ప్రధానంగా బాలీవుడ్‌కే పరిమితమైంది. మొత్తానికి, టాలీవుడ్‌పై వచ్చిన విమర్శల మధ్య తాప్సీ చేసిన తాజా ప్రశంసలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com